సహజీవన భావనల పావురాయి

# పావురాయి

వారపత్రిక 23-2-2024 15/-



# మైనారిటీ రిపోర్ట్






వారపత్రిక

**GEETURAI WEEKLY**



Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in



సంపుటి: 46 సంచిక: 8 హైదరాబాద్
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 రూ.15-00
12 షాబాన్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

## ఇతరుల తప్పులను ఎత్తి చూపుతూ అవహేళన చేయకూడదు.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


## లోపల...


| | |
|---|---|
| లోపలి మనిషికి అవార్డు ...... | 04 |
| మైనారిటీ రిపోర్ట్ ...... | 05 |
| విచక్షణా ప్రమాణం-18 ...... | 08 |
| చరితార్థులు-2 : గదరీ అబ్దుల్లాహ్ ...... | 11 |
| ఎవరూ తప్పించుకుపోలేరు ...... | 12 |
| దక్కనులో ఉర్దూ ...... | 13 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| కృత్రిమ మేథస్సు యుగం ఇది ...... | 24 |
| నా ఈ మహాపాపానికి నిష్కృతి లేదా? ...... | 27 |
| నేటి విద్యార్థి జీవితం ...... | 28 |
| ఇస్రా మేరాజ్ నేర్పిన పాఠం ...... | 30 |


## సచ్చిన పాము..



ఒట్టిపోయి ఉన్నదంట
పాలివ్వదంట ఇకబర్రె
కసాయికే తోలాల్నట
సచ్చిందోయి ఇక గొర్రె!
రేవంతుడి మాట ఇది
పని చేయదంట పుర్రె
సచ్చిన పామంట అది
ఇక చంపకండి అర్రెర్రే!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

# ఆలోచన

# లోపలి మనిషికి అవార్డు

**మోడీ ప్రభుత్వం** వరుసగా భారతరత్న అవార్డులు ప్రదానం చేస్తోంది. ఈ సంవత్సరం మొత్తం ఐదుగురికి భారతరత్న ఇవ్వడం జరిగింది. గతంలో ఎప్పుడూ ఒకే సంవత్సరం ఇంత మందికి భారతరత్న ఇచ్చింది లేదు. మాజీ ప్రధాని పి.వి. నరసింహారావుకు భారతరత్న ఇచ్చి సత్కరించింది. తెలుగుబిడ్డకు భారతరత్న లభించడం తెలుగువారందరూ సంతోషించదగిన విషయం.

పి.వి. నరసింహారావు సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక విజయాలు సాధించారనడంలో సందేహం లేదు. స్వేచ్ఛా విపణికి రెడ్ కార్పెట్ పరిచింది ఆయనే. ఒక మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్ళపాటు నడిపించిన ఘనత ఆయనది. భారతరత్న ఆయనకు లభించిన సందర్భంలో ఎంత కాదన్న మూడు విషయాలు గుర్తుకు వస్తున్నాయి.

అందులో మొదటిది 1984లో ఢిల్లీలో జరిగిన సిక్కుల ఊచకోతలు. అప్పుడు కేంద్ర హోంమంత్రి ఆయనే. ఈ అల్లర్లలో మూడువేలకు పైబడి మరణించారు. అప్పుడు కేంద్రంలో ఉన్నది కాంగ్రెసు ప్రభుత్వం. ఈ విషయమై కాంగ్రెసు ప్రభుత్వాన్ని, రాజీవ్ గాంధీని, రాహుల్ గాంధీని అనేకసార్లు అనేకమంది ప్రశ్నించారు. కాని అప్పటి హోంమంత్రిగా పి.వి. చేసిందేమిటి? పోలీసులు ఈ ఊచకోతలను చోద్యం చూశారన్న వార్తలు కూడా అప్పట్లో వచ్చాయి. పదిహేడు భాషలు మాట్లాడగలిగిన పీ.వీ. ఢిల్లీ తగలబడుతుంటే ఏ ఒక్క భాషలో కూడా మాట్లాడలేదు. పీ.వీ.ని సమర్థించే వారు ఆయన చేతుల్లో ఏమీ లేదని, గాంధీ నెహ్రూ కుటుంబం మొత్తం కథ నడిపించిందని వాదించవచ్చు. కాని కాంగ్రెసు తరపున రెండు సార్లు ప్రధానిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ స్వయంగా సిక్కు మతస్తుడు. ఆయన మాటల ప్రకారం ఢిల్లీ అల్లర్లను అదుపు చేయడానికి సైన్యాన్ని పిలవాలన్న విజ్ఞప్తులను పీ.వీ. పెడచెవిన పెట్టారు.

మరచిపోలేని మరో సంఘటన 1992 బాబరీ మస్జిదు కూల్చివేత. డిసెంబరు 6వ తేదీన కూల్చివేత జరిగింది. అప్పుడు పీ.వీ. నరసింహారావు ప్రధాని. ఎల్.కే.అద్వానీ రథయాత్ర పొడవునా మతఘర్షణలు అట్టుడికి పోతున్నప్పటికీ రథయాత్రను ఆపడానికి ఆయనేమీ చేయలేదు. బాబరీ మస్జిదు కూల్చివేతను అడ్డుకోడానికి ఆయన ఏమీ చేయలేదు. లాలూ యాదవ్ బీహారులో అద్వానీని అరెస్టు చేసి చూపించారు. పి.వీ.నరసింహారావు ఉద్దేశ్యపూర్వకంగా ఏమీ చేయకుండా తమాషా చూస్తూ కూర్చున్నారని పలువురు విశ్లేషించారు, పలువురు అభిప్రాయపడ్డారు. బాబరీ కూల్చివేత జరుగుతున్నప్పుడు ప్రధానిగా ఆయన ఎవరికీ అందుబాటులో లేరు. ఆయన పూజలో బిజిగా ఉన్నారని అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల పార్లమెంటులో చెప్పారు. బహుశా అందుకేనేమో మణిశంకర్ అయ్యర్ ఒకసారి పీ.వీ.గురించి మాట్లాడుతూ "భారతదేశానికి మొదటి బీజేపీ ప్రధాని పీ.వీ" అన్నారు. బాబరీ మస్జిద్ కూల్చివేత సంఘటన ఆ తర్వాత బీజేపీ విజయాలకు సోపానమయ్యింది.

ఓటుకు నోటు కేసు ఎవరికైనా గుర్తుందా? 1993లో పీ.వీ. ప్రభుత్వం అవిశ్వాస తీర్మానానికి గురైంది. ఝార్ఖండ్ ముక్తి మోర్చా, జనతాదళ్ ఎం.పీ.లకు లంచమిచ్చి అవిశ్వాస తీర్మానం నుంచి గట్టెక్కారనే బలమైన ఆరోపణలు వచ్చాయి. కేవలం 14 ఓట్లతో అవిశ్వాస తీర్మానం నుంచి గట్టెక్కారు. పీ.వీ. ప్రభుత్వంలో పెచ్చరిల్లిన అవినీతి విషయమై ఈ అవిశ్వాస తీర్మానం వచ్చింది. సిపిఐకి చెందిన ప్రకాష్ కరాత్ దీని గురించి వ్యాఖ్యానిస్తూ సూటుకేసులు సృష్టించిన సమస్యను సూటుకేసుతో పరిష్కరించారని చెప్పారు. సిబిఐ ఈ కేసును చేపట్టింది. విచారణ జరిగింది. చివరకు కోర్టు పీ.వీ.ని దోషిగా నిర్ధారించి మూడేళ్ళ జైలు శిక్ష కూడా విధించింది. అలా శిక్షపడిన మొదటి ప్రధాని కూడా ఆయనే. తర్వాత ఉన్నత న్యాయస్థానం నుంచి ఆయనకు ఊరట లభించింది.

నిజానికి 1991లో ఇక రాజకీయాల నుంచి విరమించుకునే నిర్ణయానికి వచ్చిన పీ.వీ. అకస్మాత్తుగా లోక్ సభ ఎన్నికల మధ్యలో రాజీవ్ గాంధీ దారుణ హత్యకు గురికావడంతో, సోనియాగాంధీ ప్రధాని పదవి స్వీకరించడానికి ఆసక్తి చూపక పోవడంతో, అప్పటి రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ప్రధాని అయ్యారు.

లిబరలైజేషన్ ద్వారా భారత ఆర్థికవ్యవస్థను పీ.వీ. నిలబెట్టారు. పీ.వీ.కాలంలో మన్మోహన్ సింగ్ ఆర్థికమంత్రిగా భారత ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించారు. నేడు మనం చూస్తున్న భారత ఆర్థిక ప్రగతి నాటి సంస్కరణల ఫలితమే అని చెప్పాలి. పంజాబులో ఉగ్రవాదాన్ని అణిచేసిన ఘనత ఆయనదే. 1998లో వాజపేయి ప్రభుత్వం అణుపరీక్షలు నిర్వహించింది. కాని ఆ అణుపరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించింది పీ.వీ.యే. అంతకుముందు ఉక్కు మహిళ ఇందిరాగాంధీ కాలంలో పోఖ్రాన్‌లో అణు పరీక్షలు నిర్వహించడం జరిగింది.

అబ్దుల్ వాహెద్



# మైనారిటీ రిపోర్ట్

**సాధారణ ఎన్నికలు** శరవేగంగా వస్తున్నాయి. బీజేపీ మరోసారి గెలుపు నమోదు చేయడానికి చేయవలసిన ప్రయత్నాలన్నీ చేస్తోంది. ఈ ప్రయత్నాల్లో భాగమే కొందరు ముస్లిము ప్రముఖులు భారతీయ జనతాపార్టీ విషయంలో ముస్లిములు పునరాలోచించాలని, ముస్లిముల పట్ల బీజేపీ ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపించడం లేదని వాదిస్తున్నారు. ఈ వాదన ఇటీవల చేసిన వారిలో తారిఖ్ మన్సూర్ పేరు చెప్పుకోవాలి. ఫిబ్రవరి ఒకటవ తేదీన ఆయన ఒక వ్యాసం రాసి మరీ తన వాదన వినిపించారు. ఆయన వాదనేమిటో చూసే ముందు ఒకసారి తారిక్ మన్సూర్ ఎవరనేది ఆలోచిద్దాం.

హిందుస్తాన్ టైమ్స్ పత్రిక జులై 30, 2023, వెబ్‌ఎడిషన్‌లో వచ్చిన వార్తప్రకారం బీజేపీ నాయకులు తారిక్ మన్సూర్ ద్వారా ముస్లిం విద్యావంతులను, ముస్లిముల్లో వెనుకబడిన వర్గాలను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు బీజేపీ ప్రారంభించింది. తారిక్ మన్సూర్ ఎవరంటే అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా చేశాడు. ఆయన్ను బీజేపీ ఉత్తరప్రదేశ్‌లో ఎమ్మెల్సీగా కూడ నామినేట్ చేసింది. ఆయన్ను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా కూడా నియమించారు. కాబట్టి బీజేపీకి అనుకూలంగా తారిక్ మన్సూర్ చేసిన వాదన వెనుక కారణాలను ఊహించడం కష్టం కాదు.

తారిక్ మన్సూర్ లాంటి మేధావుల వాదనలను చూస్తే బీజేపీ ప్రత్యేకంగా ముస్లిముల్లో వెనుకబడిన వర్గాల వారి పట్ల, సూఫీ ముస్లిముల పట్ల శ్రద్ధ చూపిస్తోంది. ముస్లిములు కూడా బీజేపీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారనేది మరో వాదన. అస్సలు 2014 తర్వాత ఎలాంటి మతఘర్షణలు లేవని దేశం 50 ఏళ్ళలో ఎన్నడూ లేనంత ప్రశాంతంగా ఉందని కూడా వాదిస్తున్నారు.

ఈ వాదనలను నిశితంగా పరిశీలిస్తే, ఎలాంటి పస లేని

వాదనలన్నది స్పష్టంగా అర్థమవుతుంది. సగటు ముస్లిములు నేడు వివక్ష, ముస్లిం విద్వేష రాజకీయాల బాధితుడున్నది అందరికీ తెలిసిన వాస్తవం. 2014 తర్వాత మతఘర్షణలు లేవనే వాదనలో వాస్తవముందా? ఢిల్లీ అల్లర్లను మరిచిపోయారా? షాహిన్‌బాగ్ నిరసన ప్రదర్శనలను అడ్డుకోడానికే కదా ఈ మతఘర్షణలు జరిగాయి. స్వయంగా ఒక మంత్రి రంగంలోకి దిగి 'గోలీమారో' అంటూ ప్రజలను రెచ్చగొట్టింది నిజం కాదా? ఈ ఘర్షణల్లో చనిపోయిన మొత్తం 51 మందిలో 37 మంది ముస్లిములు అన్నది నిజం కాదా?

బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో నేడు తరచూ వినిపిస్తున్న పదం బుల్ డోజర్. ఎవరి ఆస్తులు కూల్చివేతలకు గురవుతున్నాయి. బుల్డోజర్లతో ముస్లిముల ఆస్తులను కూల్చడం నిజం కాదా? బీజేపీ పాలిత రాష్ట్రాల మధ్య ఎవరు ఎక్కువగా ముస్లిములకు నష్టం చేయగలరనే పోటీ నడుస్తున్నట్లు కనిపిస్తోంది.

రెండేళ్ళ క్రితం రామనవమి సందర్భంగా అనేక రాష్ట్రాల్లో మతఘర్షణలు రెచ్చగొట్టింది ఎవరు? ఈ ఘర్షణల సాకుతో మధ్యప్రదేశ్ ఖార్గోన్‌లోని ముస్లిముల ఆస్తులను బుల్డోజరుతో కూలగొట్టలేదా? మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రికి బుల్డోజర్ మామా అని పేరు పెట్టారు. బుల్డోజర్ బాబా పేరుతో మరో ముఖ్యమంత్రి ప్రసిద్ధుడయ్యాడు. ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ ఈ బుల్డోజర్ కార్యకలాపాలను, ముస్లిముల ఆస్తుల అక్రమ కూల్చివేతలను వేలెత్తి చూపింది నిజం కాదా? ఫిబ్రవరి 12వ తేదీన వచ్చిన వార్త ప్రకారం మధ్యప్రదేశ్ హైకోర్టు బుల్డోజర్ కార్యకలాపాలపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. సరయిన ప్రక్రియ లేకుండా బుల్డోజర్లతో కూలగొట్టడం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారిందని వ్యాఖ్యానించింది. బాధితులకు లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశించింది. ఉత్తరాఖండ్ హల్ద్వానీలో ముస్లిములు భయాందోళనల్లో బతుకుతున్న వార్తలు వస్తున్నాయి. మస్జిదును, మదరసాను ప్రభుత్వం అక్రమంగా కూల్చిందని నిరసన తెలిపిన వారిపై ప్రభుత్వం దమనకాండకు పూనుకుంటుందన్న వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలన్నీ ఏం చెబుతున్నాయి. ఈ బాధితులంతా ఎవరు? నేర కార్యకలాపాల్లో ప్రమేయం ఉందన్న ఆరోపణలతో బుల్డోజరు ప్రయోగించి ఇళ్ళు కూలగొట్టడం ఎక్కడి న్యాయం? ఇదే విషయాన్ని ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏ.పి.షా కూడా చెప్పారు. ఇవన్నీ అందరూ చూస్తున్నవే కదా. మరోవైపు గోరక్షక దళాల పేరుతో జరుగుతున్న దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. వదిలేసిన పశువులు పొలాల్లో పడి మేయడం, రోడ్లపై ప్రమాదాలకు కారణమైన వార్తలు ఒకవైపు వస్తుంటే మరోవైపు ముహమ్మద్ అఖ్లాక్ మొదలు అనేక కేసుల్లో మూకదాడులు, మూకహత్యల దాడుల్లో బాధితులే ముస్లిములే.

సెప్టెంబర్ 23, 2023వ తేదీ న్యూస్ క్లిక్ వార్తాసంస్థలో వచ్చిన కథనం ప్రకారం ఆల్ ఇండియా పస్మాందా ముస్లిం మహాజ్ వ్యవస్థాపకుడు అలీ మునవ్వర్ పస్మాందా లేదా వెనుకబడిన ముస్లిం సముదాయాల గురించి మాట్లాడుతూ మూకహత్యలు, బుల్డోజర్ దాడుల బాధితుల్లో అత్యధికులు పస్మాందా ముస్లిములు లేదా వెనుకబడిన సముదాయాలకు చెందిన ముస్లిములే అన్నాడు. పస్మాందా ముస్లిములు ఒక్కటై మతతత్వ శక్తులను రాజకీయంగా ఓడించాలని కూడా ఆయన పిలుపునిచ్చాడు.

వాస్తవాలు ఇలా ఉంటే తారిక్ మన్సూర్ వంటి సోకాల్డ్ మేధావులు ముస్లిములకు బీజేపీ గురించి పునరాలోచించాలని పిలుపునిస్తున్నారు. భారతదేశంలోని ముస్లిం సముదాయంలో 80 శాతం ముస్లిం వెనుకబడిన వర్గాలే అని స్వయంగా తారిక్ మన్సూర్ రాసిన వ్యాసంలోనే పేర్కొన్నాడు. అలాంటప్పుడు మూకదాడులకు, బుల్డోజర్ దాడులకు గురవుతున్న వాళ్ళెవరు? ఈ వెనుకబడిన ముస్లిం సముదాయాల కోసమే ప్రధాని మోడీ చాలా ఆలోచించేస్తున్నారని చెప్పే తారిక్ మన్సూర్ వంటి మేధావులు ఈ మూకదాడులపై ఎప్పుడైనా నోరెత్తారా? ఎప్పుడైనా ప్రశ్నించారా? ఎప్పుడైనా ఆలోచించారా? బీజేపీ మతతత్వ రాజకీయాల బాధితులు ఎక్కువ మంది పస్మాందా ముస్లిములే అన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇప్పుడు వారందరిని ఆదుకునే అవతారమెత్తుతున్నామని చెబుతున్నారు.

పస్మాందా ముస్లిముల కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే బీజేపీ బిల్కిస్ బానో గురించి ఏం చెబుతుంది? బిల్కిస్ బానో కూడా పస్మాందా సముదాయాలకు చెందిన మహిళే. ఆమె మొత్తం కుటుంబాన్ని, చిన్నారి కూతురుని హతమార్చిన నేరస్తులకు గుజరాత్ బీజేపీ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించి విడుదల చేసింది నిజం కాదా? మూకహత్యకు గురైన తబ్రేజ్ అన్సారీ పస్మాందా ముస్లిం కాదా? అలీముద్దీన్ అన్సారీని మూకహత్య చేసిన నేరస్తులను బీజేపీ మంత్రి హోదాలో జయంత్ సిన్హా పూల మాలలు వేసి సత్కరించింది మరిచిపోయారా? అలీముద్దీన్ అన్సారీ కూడా పస్మాందా ముస్లిమే. వాస్తవాలు ఇలా ఉంటే పస్మాందా ముస్లిములను ఉద్ధరించేది బీజేపీ అంటూ తారిక్ మన్సూర్ వంటి వాళ్ళు చెప్పే మాటలకు అర్థముందా?

లవ్ జిహాద్ పేరుతో గగ్గోలు ఎంత జరిగింది? జరుగుతోంది? లవ్ జిహాద్ నిరూపించే ఒక్క కేసు ముందుకు వచ్చిందా? లవ్

జిహాద్ కు తోడు యుపియస్సీ జిహాద్, ల్యాండ్ జిహాద్, కరోనా జిహాద్ ... ఇలా ప్రతి దానికి జిహాద్ తగిలించి దేశంలో మతతత్వ రాజకీయాలు నడుపుతున్న వాళ్ళు, ముస్లిముల పట్ల విద్వేషం రెచ్చగొట్టడం ద్వారా మాత్రమే రాజకీయ ఉనికి నిలబెట్టుకుంటున్న వాళ్ళు ముస్లిముల బాగు కోసం పనిచేస్తారని మాట్లాడడం వింటే ఏమనిపిస్తుంది?

తారిక్ మన్సూర్ తన వ్యాసంలో మోడీ సాధించిన విజయంగా త్రిపుల్ తలాక్ నిషేధం గురించి కూడా మాట్లాడాడు. కాని త్రిపుల్ తలాక్ చట్టం వల్ల ఎవరికైనా ప్రయోజనం కలిగిందా? ఇండియా టుడేలో నాజిమా పర్వీన్ జూన్, 21, 2023లో రాసిన వ్యాసం ప్రకారం ఈ చట్టం పురుషులకే ఎక్కువగా ఇప్పుడు ఉపయోగపడుతోంది. అటు విడాకులు ఇవ్వకుండా, ఇటు కాపురానికి తీసుకోకుండా వదిలేస్తున్న సంఘటనలు ముందుకు వచ్చాయి. ఇప్పుడు త్రిపుల్ తలాక్ కేసులు రావడంలేదు, భర్తలు వదిలేస్తున్న కేసులు వస్తున్నాయి. ఇవి ప్రతి సముదాయంలోను ఉండేవే కాబట్టి త్రిపుల్ తలాక్ ను లేకుండా చేశాం అని గొప్పలు చెప్పుకోడానికి మాత్రమే ఈ చట్టం ఉపయోగపడుతుంది. అంటే తలాక్ ఇచ్చి విడిపోవడం కన్నా ఎలాంటి సంబంధమూ లేకుండా, మాట్లాడకుండా, లేదా పుట్టింట్లోనే ఉండిపోయేలా వదిలేయడం ఎక్కువయ్యింది.

ఇస్లామోఫోబియా ఇప్పుడు పరాకాష్ఠకు చేరుకుంది. నగరాల్లో ముస్లిముల ఘెట్టోలు పెరుగుతున్నాయి. అద్దె ఇళ్ళు ముస్లిములకు దొరకడం లేదు. విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబాటు పెరుగుతోంది. మరోవైపు వివక్ష కొనసాగుతోంది. మౌలానా ఆజాద్ ఫెలోషిప్‌ను రద్దుచేశారు. దీనివల్ల నష్టపోయింది ఉన్నత చదువులు చదవాలనుకునే ముస్లిం విద్యార్థులే.

నేషనల్ రిజిష్టర్ ఆఫ్ ముస్లిం సిటీజన్స్ లేదా ఎన్నార్సీ కత్తి ఇంకా వేలాడుతోంది. అవసరమైన కాగితాలు సమర్పించలేని పరిస్థితిలో ఉండేది పేదసాదలైన వెనుకబడిన సముదాయాలకు చెందిన ముస్లిములే. వారందరి పౌరసత్వం ఇప్పుడు ప్రమాదంలో పడుతుంది. మతం ప్రాతిపదికన పౌరసత్వాన్ని నిర్వచిస్తున్న పౌరసత్వ సవరణ చట్టం కూడా వచ్చింది. అస్సాములో ఏం జరిగింది. 19 లక్షల మంది ఎన్నార్సీలో పేరు కోసం తగిన పత్రాలు సమర్పించలేకపోయారు. ఇందులో చాలా మంది హిందువులే. కాని పౌరసత్వ సవరణ చట్టం ఉంది కాబట్టి వారికి ఈ చట్టం ప్రకారం పౌరసత్వం వచ్చేస్తుంది. కాని ఈ జాబితాలో ఉన్న ముస్లిముల పరిస్థితి ఏమిటి? వారిని నిర్బంధ శిబిరాలకు తరలించే కార్యక్రమం మొదలవుతుంది. వారి ఓటు హక్కు రద్దవుతుంది. ఇదే యావద్దేశంలో అమలు చేసే తతంగం ప్రారంభించే ఆలోచనలు నడుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో పస్మాందా ముస్లిములు నెట్టేయబడే అవకాశం లేదని బీజేపీ నేతలు చెప్పగలరా? బీజేపీ గురించి వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్న తారిక్ మన్సూర్ వంటి మేధావులు పౌరసత్వ సవరణ చట్టంలో పస్మాందా ముస్లిములకు కూడా మినహాయింపు లభించేలా చేయగలరా?

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఒకవైపు రామమందిర నిర్మాణం పేరుతో జరుగుతున్న కార్యక్రమాలు, మరోవైపు మతతత్వ రాజకీయాల నేపథ్యంలో ముస్లిములకు రాజకీయ ప్రాతినిధ్యం రోజు రోజుకు తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిముల్లో పస్మాందా ముస్లిములంటూ నడుస్తున్న రాజకీయాల నిజస్వరూపాన్ని అందరూ అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ✤


## ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు – హిందీ – ఇంగ్లీష్ – తమిళం – కన్నడ – మరాఠీ – బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్‌ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

అధ్యాయం -7

18

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

### 1.ఆయన విభిన్న పాత్రలు

ముస్లిములు మక్కా నాయకుల దౌర్జన్యాలను భరించలేక మదీనాకు రావలసి వచ్చిందన్న విషయం మక్కా కురైష్ నాయకులకు కూడా బాగా తెలుసు. అయినా వారు మదీనాలో కూడా ముస్లిములను ప్రశాంతంగా కూర్చోనివ్వరాదని నిర్ణయించుకున్నట్లు బోధపడుతుంది. బద్ర్ పోరాటంలో ముస్లిముల విశ్వాస బలిమిని పరిశీలించి ఒక్క సంవత్సరమే గడిచినా మునుపటి కన్నా మూడు రెట్లు అధికంగా సిపాయీలు, నాలుగు రెట్లు అధికంగా యుద్ధ సామగ్రితో ముస్లిముల నిర్మూలనకు బయలుదేరారు కురైష్ నాయకులు.

వారు తోడుగా తమ భార్యాపిల్లలను సయితమూ తీసుకు వచ్చారు, పరిస్థితులు విషమించినా సైనికులు వారిని వదిలేసి పరారవరాదన్నది వారి ఉద్దేశం. లేదా పరిస్థితులు అనుకూలిస్తే బద్ర్‌లో తమ వారిని చంపిన వారు, నేడు తమ ఆప్తుల కత్తి వాటుకు కాళ్లూ చేతులూ కొట్టుకుంటూ ఉండగా ఆ స్త్రీలు చూడాలని ఆశించారు. ఇలా మక్కా విగ్రహారాధకులు వచ్చి ఉహుద్ పర్వత లోయలో మోహరించారు.

### ముస్లిమ్ సమాజంలో పరిస్థితి

ఇదంతా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉన్న ప్రవక్త మహనీయులు (స) సయితం జుమా నమాజ్ చేసుకుని వెయ్యి మంది ముస్లిమ్ యోధుల వెంట బయలు దేరారు. ఆ రోజు హిజ్రీ 3వ సంవత్సరం, షవ్వాల్ నెల, 14వ తేదీ (మార్చి 29, క్రీ. శ. 624). దారిలో ద్వంద్వ నీతి పరులు ఈ వెయ్యి మందిలో నుంచి తమ అనుయాయుల్ని మూడు వందల మందిని తీసుకుని వెనక్కి మరలి పోయారు. ప్రవక్తశ్రీ, ఆయన సహచరులకు తమ దైవంపైనే తప్ప మరి దేని పైనా భరోసా లేదు. కాబట్టి వారు ఏ మాత్రం గాభరా పడలేదు.

దైవ మార్గంలో ప్రాణాలర్పించడానికి వచ్చిన వారిలో ఇంకా యుక్తవయసుకు రాని వారు కూడా ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. వీరిని పోరులో పంప రాదని ప్రవక్తశ్రీ ఆదేశించగానే ఆ నవయువకులు తమ కాలి వ్రేళ్ళపై నిలబడి, రొమ్ము చాచి ప్రవక్తశ్రీ ని, “దైవప్రవక్తా! చూడండి, మేము చిన్న

వాళ్ళము కాము'' అని వేడుకున్నారు. ఈ ఉపాయం చేసిన 'రాఫె'ను చూసి మరో నవ యోధులు 'సముర', తన్ను పంప రాదని నిర్ణయిస్తే, తాను రాఫె కన్నా శక్తి శాలినని వాదించారు. వారిద్దరి మధ్య కుస్తీ పోటీ నిర్వహించడం జరిగింది. రాఫెను పడేశారు సముర. అప్పుడు ఆయన్ని కూడా సైన్యంలో చేర్చడం జరిగింది! ఇదీ ఆనాటి ముస్లిమ్ యోధుల పరిస్థితి!!

## మహనీయ ఉమర్ వైఖరి

ప్రవక్త(శ్రీ(స) ఉహుద్ కొండ తమకు వెనుకన ఉండేలా సేనను వరుసలుదీర జేశారు. అలాగే ఓ కొండ కనుమ వద్ద యాభై మంది విలుకాండ్రుల్ని నియమించారు. పోరు ప్రారంభమవ గానే ముస్లిముల దాడి ధాటికి తిరస్కారులు ఛిన్నాభిన్నమయి పోయారు. ముఖ్యంగా మహనీయులు అబూ దుజాన, అలీ, హమ్జా (ర) ధాటికి తట్టుకోలేక తిరస్కారులు పలాయనం చిత్తగించడం తప్ప గత్యంతరం లేక పోయింది. అదే సమ యాన కొందరు సహచర మాన్యులు శత్రువులు పారి పోయారన్న తలంపుతో యుద్ధ ప్రాప్తి సేకరించడానికి కనుమ వద్ద ఉన్న విలుకాండ్రులు సయితం కనుమ విడిచి వచ్చేశారు.

కొండ కనుమ వద్ద సిపాయిలు లేకపోవడం చూసి ఖాలిద్ బిన్ వలీద్ దళం ఆ వైపు నుంచి అకస్మాత్తుగా దాడి జరిపింది. ప్రవక్త శ్రీ గాయపడ్డారు. అయితే శత్రువులు ఆయన అమర గతులయ్యారని కేకలు వేశారు. ఈ పరిస్థితిలో గెలిచిన పోరు ఓడినట్లయింది. మహనీయ ఉమర్ ఈ ఉద్యమంలోనూ ప్రవక్తశ్రీకి చేదోడువాదోడుగానే ఉన్నారు.

1. ప్రారంభంలో ప్రవక్త క్యాంపుకు పహారా కాయడానికి ముహమ్మద్ బిన్ ముస్లమ నియుక్తులయ్యారు. కాని ఓటమి తరువాత ఆ డ్యూటీ మహనీయ ఉమర్ తీసు కున్నారు, కరవాలం పట్టుకుని ప్రవక్త శ్రీ వసారా చుట్టూ తిరగ సాగారు.

2. ముస్లిములు దెబ్బ తిని, భయానికి గురి అయినప్పుడు ప్రవక్తశ్రీ (స) కూడా రణరంగంలోకి దిగారు. ఆయన తోపాటు శత్రు గణం పైన ఉమర్ కూడా గట్టి దాడి జరిపారు. ఓ సందర్భంలో ప్రవక్త మహనీయులు గుంటలో పడగా శత్రువులు, ఆయన పరమపదించారని అరి చారు. క్షణంపాటు మహనీయ ఉమర్ కూడా అమిత మయిన బాధకు గురయ్యారు. కాని త్వరగానే తేరుకుని ప్రవక్త శ్రీ శత్రువుల పైన అంబుల వర్షం కురిపించడం గమనించి తాను కూడా ఆ వైపుకు వెళ్లి వైరులతో పోరాడ సాగారు. ఇలా ప్రవక్తశ్రీకి రక్షణ దొరకగా ఇతర సహచ రులు ఆయన్ని కొండ పైకి తీసుకు వెళ్లారు.

3. ప్రవక్త(శ్రీ)ని సురక్షితంగా కొండ పైకి చేర్చడం జరిగిందని గమనించగానే తిరస్కారుల నాయకుడు ఖాలిద్ బిన్ వలీద్ అటువెళ్ళి దాడి జరపటానికి రాసాగాడు. అప్పుడు మహనీయ ఉమర్ ఇంకా కొందరు సహచరులతో కలిసి పై నుంచి బండ రాళ్ళను దొర్లించారు. శత్రువులు అటు నుంచి వెనుదిరిగారు.

4. ఆ సందర్భంలో కురైష్ నాయకుడు అబూ సుఫ్యాన్ ఓ పెద్ద దిబ్బ పైనెక్కి అడిగాడు, "మీలో ముహమ్మద్ ఉన్నారా?'' అని. ప్రవక్తశ్రీ, సమాధానం ఇవ్వ వద్దని అన్నారు. అతను మళ్లీ అడిగాడు, "మీలో అబూ కుహాఫా తనయుడు (అబూ బక్ర్) ఉన్నారా,'' అని. దానికీ సమా ధానం ఇవ్వ వద్దని అన్నారు ప్రవక్తశ్రీ.

   అతను తిరిగి అడిగాడు, "మీలో ఖత్తాబ్ కుమారుడు ఉన్నారా?'' అని.

   దీనికీ సమాధానం రాకపోవడంతో అతను, "అందరూ హతులయ్యారు. ఉంటే జవాబు ఇచ్చేవారు'' అన్నాడు.

   ఇది విని మహనీయ ఉమర్ తాళ లేక పోయారు, అతి గంభీర స్వరంతో అరిచారు, "ఓ దైవ విరోధి! దైవం నీ పరాభవం కొరకు ఇంకా ఎంతో మిగిల్చి పెట్టాడు'' అని.

   అప్పుడు అతనూ బిగ్గరగా అరిచాడు, "హుబల్ (కురైషీల ఓ విగ్రహం) మహోన్నతుడు'' అని.

   అప్పుడు ప్రవక్తశ్రీ మహనీయ ఉమర్ కు ఆదేశించారు," ఒక్క గానొక్క దైవం అల్లాహ్ మాత్రమే మహోన్నతుడు'' అని ప్రకటించమని.

5. ఇక అబూ సుఫ్యాన్ ఉమర్ కంఠం గుర్తు పట్టి ఆయన్ని పిలిచాడు. పిలుపు ప్రవక్త కూడా విని," వెళ్లి చూడు, ఏమంటున్నాడో'' అని పురమాయించారు. అక్కడికి వెళ్ళగా అతను అడిగాడు, "ఉమర్! నిజం చెప్పు,

ముహమ్మద్ హతులయ్యారా, లేదా?'' దానికి ఉమర్ చెప్పారు, ''ఓ దైవ ధిక్కారి! ఆయన కొండ మీద ఉన్నారు, ఆయనే నీ కంఠం విని నన్ను పంపారు.''

''సరే, నీవు నా దృష్టిలో ఆయన మృతి చెందారని కేక వేసిన ఇబ్ను కిమ్మ కన్నా సత్యవంతుడివి.

అయితే ఇది బద్ర్‌కు ప్రతీకారం! వచ్చే సంవత్సరం మళ్ళీ కలసుకుందాము'' అన్నాడు.

ప్రవక్త(స), ''మాకు సమ్మతమే అని చెప్పు'' అన్నారు.

### తెగలన్నింటి ఉమ్మడి దాడి!

మక్కా తదితర ప్రాంతాల బహుదైవారాధకులు, ఖైబర్ దుర్గం లోని యూదుల సైన్యం, దాదాపు పన్నెండు వేల మంది, అంతా కలిసి హిజ్రీ 5వ సంవత్సరం మదీనా పవిత్ర నగరిపైకి పెద్ద ఎత్తున దాడి జరిపేందుకు రహస్యంగా కూడపలుక్కు న్నారు. అలాగే ఉత్తరాన బనీ నజీర్, కైనుకా యూదులు, తూర్పున గత్ఫాన్ కుచెందిన బహుదైవారాధకులు, దక్షిణాన సమస్త కురైష్ తెగలు, వారి ఒడంబడిక దారులు కూడా వారికి తోడయ్యారు.

ఈ ఏర్పాట్లను గురించి ఒక్కొక్క విషయం, ఎప్పటికప్పుడు ప్రవక్త(స) కి తెలుస్తూనే ఉంది. శత్రువుల ఈ కూటమి బయలు దేరి రాక మునుపే దైవ సందేశహరులు, ఆరు రోజుల లోపున మదీనా నగరానికి చుట్టూతా- తూర్పు, పడమర, ఇంకా ఉత్తర దిశన దాదాపు రెండున్నర గజాల లోతు గల ఓ కందకం త్రవ్వించ గలిగారు. మరి మూడు వేల ముస్లిమ్ యోధులు కందకానికి పహరా కాయడానికి నియుక్తులయ్యారు. నగరానికి దక్షిణ సరిహద్దులు ప్రకృతి సిద్ధంగా దాడికి వీల్లేకుండా సురక్షితంగా ఉన్నాయి.

ప్రవక్త మహనీయులు కందకాన్ని విభజించి కమాండర్లను నియమించారు. ఒక భాగానికి మహనీయ ఉమర్ ఫారూక్(ర) కమాండర్‌గా నియుక్తులయ్యారు. ఆయన నియుక్తులయిన చోట ఓనాడు శత్రు దళాల దాడి జరిగింది. అప్పుడు ఆయన తన దళంతో త్రిప్పి కొట్టగా శత్రువులంతా ఛిన్నాభిన్నమయిపోయారు. ఆయన కూడా బలంగా పోరాడి వారికి భారీ నష్టం కలగజేశారు.

ఆ సందర్భంలోనే పోరులో నిమగ్నత వల్ల, తాను అస్ర్ నమాజ్, వేళ దాటిపోవడం చేత, చేయలేక పోయానని మహనీయ ఉమర్ వచ్చి ప్రవక్త(స)కి నివేదించుకున్నారు. అప్పుడు ప్రవక్త(స) కూడా నేడు ఈ తిరస్కారులు పాడుగాను, తనకు కూడా నమాజ్‌కు అవకాశం ఇవ్వలేదని చెప్పారు.

ఆయన నియుక్తులయిన చోట ప్రాముఖ్యత కారణంగా, మస్జిద్ నిర్మించుకున్నారు ముస్లిములు! నేటికీ దాన్ని 'మస్జిదె ఉమర్' గానే పిలుస్తారు జనం.


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

'చరితార్థులు'-2



# గదరీ అబ్దుల్లాహ్

## (-1915)

34



బ్రిటిష్ వలసపాలకుల కబంధహస్తాలలో నలిగిపోతున్న మాతృభూమి విముక్తికి సాయుధ పోరాటం మినహా మరో మార్గంలేదని నమ్మిన గదర్ పార్టీ యోధులు గదరీ అబ్దుల్లాహ్ ప్రస్తుత పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రం గుజ్రన్ వాలా జిల్లా, ముద్రికా పోలీసు పరగణా లోని తుప్రాల్ గ్రామ నివాసి. ఆయన తండ్రి అల్లాహ్ దీన్. అబ్దుల్లాహ్ బ్రిటిష్ భారత సైన్యంలో చేరిన '23వ అశ్విక దళం' సభ్యులయ్యారు. ఆంగ్లేయుల తరిమివేతకు సాయుధ పోరాటం సాగిస్తున్న గదర్‌వీరుల ప్రేరణతో మాతృ భూమి విముక్తి లక్ష్యంగా ఆంగ్లేయ సైన్యాల మీద పోరాటానికి అబ్దుల్లాహ్ సిద్ధమయ్యారు. ఆ ప్రయత్నాలలో భాగంగా '23వ అశ్విక దళం'లోని అబ్దుల్లా, ఆయన సహచరులు బాంబు లను తయారుచేసి, 1915 మే 13న వాటిని గమ్యస్థానానికి తరలిస్తుండగా పొరపాటున బాంబులు ప్రేలాయి. ఆ సంఘటన వివరాలను తెలుసుకున్న నమ్మకద్రోహులు కొందరు ఆంగ్లేయాధికారులకు విషయం తెలపటంతో గదర్ యోధుల పథకం విఫలమయ్యింది. బ్రిటిష్ సైనికాధికారులు ఆఘమేఘాల మీద స్పందించి అబ్దుల్లాహ్ ఆయన సహచరులను నిర్బంధించారు. ఆ తరువాత సైనిక న్యాయస్థానంలో విచారణ జరిపారు. అబ్దుల్లాహ్‌ను మొదటి ముద్దాయిగా పేర్కొన్నారు. ఆయనకు, ఆయన సహచరులు పదకొండు మందికి 1915 సెప్టెంబర్ మూడున ఉరిశిక్ష విధించారు. ఉరిశిక్ష విధించబడిన 12 యోధులలో 11 మంది శిక్కు మతస్థులు కాగా అబ్దుల్లా ఒక్కరే ముస్లిం. అబ్దుల్లాహ్ జైలులో ఉండగా బ్రిటిష్ పోలీసు వ్యవస్థలో అధికారిగా పని చేస్తున్న ఆయన బంధువు ఒకరు వచ్చి ఆయనను కలిసి వెళ్ళారు. ఆ నేపథ్యంలో అబ్దుల్లాహ్ సహచరుడు దఫేదార్ లక్ష్మన్ సింగ్ అబ్దుల్లాతో మాట్లాడుతూ 'మౌల్వీజీ మేము ఏలాగూ అన్నిటికి (ఉరిశిక్షకు) సిద్ధపడి ఉన్నాం... మీరన్నా స్టేట్‌మెంట్ ఇచ్చి మీ ప్రాణా లను కాపాడుకోండి' అని సలహా ఇచ్చారు. ఆ సలహాకు అబ్దుల్లాహ్ సమాధాన మిస్తూ 'లక్షల సంఖ్యలో మాత్రమే ఉన్న శిక్కులలో 11 మంది మాతృ భూమి కోసం ప్రాణాలు బలి చేయడా నికి సిద్ధంగా ఉన్నారు. ఎనిమిది కోట్ల మంది ఉన్న ముస్లింలలో నేను ఒక్కడినే ఉండటం సిగ్గుచేటుగా భావిస్తున్నాను. నా ప్రాణా లను రక్షించుకోడానికి మీ నుండి దూరమయ్యే అవమానకర మైన పనిని అల్లాహ్ దయవల్ల నేను చేయనుగాక చేయను' అని ప్రకటించారు. 1915 సెప్టెంబర్ మూడున ఉరిశిక్ష స్వీకరణకు ముందు కూడా ఆయన మాట్లాడుతూ 'మా మరణం తరువాత కూడా... మమ్మల్ని వేరు చేయకండి... మమ్మల్నందర్నీ ఒకే సమాధిలో పూడ్చిపెట్టండి లేక పోతే అందర్నీ కలిపి ఒకే చితిమీద తగుల బెట్టండి' అంటూ తన అభిమతాన్ని ప్రకటించి గదరీ అబ్దుల్లాహ్ అమరులయ్యారు. ✤



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

నమ్మినా నమ్మకపోయినా? 17

# ఎవరూ తప్పించుకుపోలేరు

**ఈ ప్రపంచంలో** ఎన్నో గ్రంథాలున్నాయి. అవి అన్నీ ఈ ప్రపంచాన్ని మరియు మానవులను సృష్టించిన దేవుని చేత పంపబడ్డాయని పేర్కొనబడుతున్నాయి. అలాంటి వాటిలో దేవుని అంతిమ గ్రంథంగా పంపబడిన గ్రంథం ఖుర్ఆన్. ఇది ప్రళయకాలం వరకు పుట్టబోయే మానవులందరి కొరకు పంపబడిందనీ, ఇంకా మానవులందరూ తిరిగి బ్రతికించబడి లేపబడతారని, ఆపై ఈ ప్రపంచంలో మానవులు చేసుకున్న తమ కర్మల ప్రకారం మూడు వర్గాలుగా విభజించబడతారని గట్టిగా నొక్కి వక్కాణిస్తోంది ఖుర్ఆన్.

ఆ మూడు వర్గాలు ఈ విధంగా ఉంటాయి :

- కుడిపక్షం వారు – దీవించబడినవారు.
- ఎడమపక్షం వారు – దౌర్భాగ్యులు.
- విశ్వసించినవారు – స్వర్గసౌఖ్యాల్లో తేలియాడేవారు.

ఇక ఎడమపక్షం వారి గురించి ఖుర్ఆన్ గ్రంథం ఏమని పేర్కొన్నదో చూద్దాం.

“ఎడమపక్షం వారు, ఎడమ పక్షం వారి(దౌర్భాగ్యాన్ని)ని గురించి ఏమని చెప్పాలి. వారు వడగాలి మధ్య సలసల కాగే నీటిలో, నల్లని పొగల నీడలో ఉంటారు. అది చల్లగానూ ఉండదు, సుఖంగానూ ఉండదు. ఈ గతి పట్టకముందు వారు సంపన్నులుగా ఉండేవారు, చెప్పినా వినకుండా మూర్ఖంగా మహాపాపాలు చేస్తూ ఉండేవారు. వారు ఇలా అనేవారు, “మేము మరణించి మట్టిగా మారిపోయినప్పుడు, అస్థిపంజరంగా అయిపోయినప్పుడు, మళ్లీ లేపబడతామా? పూర్వం గతించిన మా తాతముత్తాతలు కూడా లేపబడతారా?” ప్రవక్తా! వారితో ఇలా అను, “నిశ్చయంగా గతించిన వారు, తరువాతి వారు, అందరూ ఒక రోజున తప్పకుండా సమావేశపరచబడతారు. దాని కాలం కూడ నిర్ణయమైపోయింది.” మార్గభ్రష్టులారా! తిరస్కారులారా! మీరు జఖ్ఖూమ్ చెట్టును ఆహారంగా తింటారు. దానితోనే మీరు మీ కడుపులను నింపుకుంటారు. ఆపై సలసల కాగే నీటిని దప్పికగొన్న ఒంటెల మాదిరిగా త్రాగుతారు. తీర్పుదినం నాడు (ఈ ఎడమపక్షం వారికి లభించే) ఆతిథ్యపు పదార్థాలు ఇవి.”

*(దివ్యఖుర్ఆన్ : 56 : 41-56)*

ఇక విశ్వసించాలా వద్దా అనేది ఓ పెద్ద ప్రశ్న.


ఇదంతా ముందుగానే తెలిసిన తరువాత ఇక మనం చేతులు ముడుచుకొని కూర్చోలేము. దీర్ఘంగా దీన్ని గురించి ఆలోచిస్తూ ఈ భయంకరమైన, మనుషులను పట్టి కుదిపిపేసే ఈ విషయం నిజమా లేక అబద్ధమా? అని తరచిచూడవలసిన తరుణం ఆసన్నమైంది.

ఇదే గ్రంథం ఇంకా ఏమని తెలియజేస్తుందంటే మనిషి చనిపోయిన పిదప మళ్లీ ఈ ప్రపంచంలోకి ఎట్టిపరిస్థితిలోనూ తిరిగి పంపబడదు. ప్రస్తుతం ప్రపంచంలో అతనికి లభించిన ఈ జీవితమే తుది జీవితం. ఈ విషయం మరింత గగుర్పాటుకు గురి చేస్తుంది. ఈ జీవితం క్షణభంగురం, ఇక్కడ అనుకోకుండా మనిషి అకాల మృత్యువుకు గురికావచ్చు. ఈ విషయం కూడా మనిషిని తొందరగా నిర్ణయం తీసుకోమని హెచ్చరిస్తోంది.

పైన తెలిపిన విషయాలన్నీ ఆలోచించి తగు నిర్ణయం తీసుకోమని పదే పదే మనిషిని హెచ్చరిస్తున్నాయి. మృత్యువు నుండి ఎవరూ తప్పించుకోలేరు. ప్రతివారూ దాని రుచి చూడవలసిందే. అక్కడి నరక యాతనలను చూసిన పిదప ఎంత వగచినా లాభం లేదు. ఎవరూ దాన్నుండి తప్పించుకోరు. శాశ్వతంగా ఉండే పరలోక జీవితం పట్ల అప్రమత్తంగా మెలగుతూ ఈ ప్రాపంచిక జీవితంలోనే తగు నిర్ణయం తీసుకోమని ప్రతి వ్యక్తిని ఈ విషయాలు హెచ్చరిస్తున్నాయి.

**- డా. ముహమ్మద్ ముఅజ్జమ్ అలీ**

# దక్కనులో ఉర్దూ



**- డాక్టర్ ఎస్.సదాశివ**

**వింధ్య** పర్వతాలకు దక్షిణంలో వుండే భారత భూభాగాన్ని దక్కన్ అనటం పరిపాటి. ఉత్తర భారతాన 12వ శతాబ్ది నుంచే ఇరాన్ తుర్కిస్తాన్ ప్రాంతాల నుండి వచ్చిన ముస్లిం సుల్తానుల పరిపాలన మొదలయింది. దక్కనులో మాత్రం 15వ శతాబ్ది ప్రారంభంలో బహమనీ వంశానికి చెందిన ముస్లిం సుల్తానుల పరిపాలన మొదలయింది. ఉత్తరంలోను దక్షిణంలోను ఉన్న సుల్తానుల భాషలు ఫారసీ, అరబీ, తుర్కీలే. ఢిల్లీ సుల్తానులు తమ భాషలనే పరిపాలన వ్యవహారాలలో ఉపయోగించుకున్నారు గాని ప్రజల భాషలకు ప్రాముఖ్యం ఇయ్యలేదు. కాని దక్కను సుల్తానులు మాత్రం మొదటి నుంచే ప్రజల భాషలకు ప్రాముఖ్యం ఇచ్చినారు. భారతదేశ చరిత్ర వ్రాసిన ఫరిష్తా మాటలను నమ్మినట్లయితే బహమనీ సుల్తానుల ఆదాయ వ్యయ వ్యవహారాలు దక్కనీ ఉర్దూలో జరిగేవి. చరిత్రకారుడు ఫరిష్తా మాటలు నమ్మినట్లయితే అని ఎందుకన్నానంటే అతడు రాసిన చరిత్రలో అసత్య కథనం కొంత ఉన్నదని ప్రామాణికులైన కొందరు ముస్లిం చరిత్రకారులే అంగీకరించినారు. దక్కనీ ఉర్దూ అనే మాట వాడినాను. అది ముస్లిం సుల్తానుల కాలంలో దక్షిణ దేశంలో రూపొందిన ఒక కొత్త భాష. అందులో ఫారసీ, అరబీ, తుర్కీ శబ్దాలతోపాటు, ప్రాంతీయ భాషల శబ్దాలు, ప్రాకృత శబ్దాలు కలిగి వుండేవి.

13వ శతాబ్దిలో ఢిల్లీని పాలించే అల్లావుద్దీన్ ఖిల్జీ దక్షిణ దేశంపై దండెత్తి వచ్చినాడు. అతని వెంట వచ్చిన కొందరు సైనికులు, వృత్తి కళాకారులు, వ్యాపారస్తులు, సూఫీ ఫకీరులు ఇక్కడే ఉండిపోయినారు. వాళ్లు ఉత్తరంలో రూపుదిద్దుకుంటున్న ఒక నూతన భాషనే కాక ఫారసీ, అరబీ, తుర్కీ శబ్దాలను కూడా తమ వెంట తెచ్చుకున్నారు. ఆ భాషే ఇక్కడి గుజరాతీ, మహారాష్ట్ర, ప్రాకృత భాషలలోని కొన్ని శబ్దాలు చేర్చుకొని ద్రవిడ భాషల ఉచ్చారణతో ఒక కొత్త భాషగా రూపొందింది. దక్షిణాన వున్న ద్రవిడ భాషల శబ్దాలు ఈ భాషలో చేరలేదు. యాస మాత్రం చేరింది. దాన్నే మొదట్లో హిందీ అన్నారు, హిందుస్తానీ, తర్వాత దకనీ అన్నారు. అదే కాలక్రమాన దకనీ ఉర్దూ అయింది.

ఇక్కడ మనం అప్పుడు ఢిల్లీలో రూపొందుతున్న భాషను గురించి కొంచెం తెలుసుకోవటం అవసరం. వేరు వేరు భాషలు మాట్లాడే ప్రజలు ఏ కారణం వల్లనైనా కొంతకాలం ఒకే ప్రాంతంలో కలసిమెలిసి నివసించవలసిన పరిస్థితులు ఏర్పడితే పరస్పర భావ వ్యక్తీకరణ కోసం ఒక కలగూర గంప భాషను రూపొందించుకోవటం తప్పనిసరి అవుతుంది. ఒక కలగూర గంప భాష ఏర్పడటానికి చారిత్రక, రాజకీయ, ధార్మిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులు కారణాలవుతాయి. 13వ శతాబ్దిలో ఢిల్లీని పాలించే ముస్లిం సుల్తానులకు, వాళ్ల వెంట వచ్చిన మంత్రులకు, సైన్యాధిపతులకు అధికారులకు ఫారసీ, అరబీ, తుర్కీ భాషలు తప్ప ఇక్కడి భాషలు తెలియవు. ఢిల్లీలోను, దాని పరిసర ప్రాంతాలలోను ప్రజలు మాట్లాడుకునే భాషలు ఖడీబోలీ, పంజాబి, హరియాన్వి, బ్రజ్, అవధి- మాగధి, రాజస్థానీ మొదలైన ప్రాకృత భాషలు, అవి ప్రాకృతాలు కూడా కావు, ప్రాకృత భాషల అపభ్రంశ రూపాలు; అల్లావుద్దీన్ ఖిల్జీ దర్బారులో అమీర్ ఖుస్రూ అనే ఒక గొప్ప ఫారసీ కవి వుండేవాడు. అతడు ఈ దేశంలో పుట్టినవాడే. అతని తల్లి ఈ దేశందే. కనుక అతనికి ఈ దేశం పట్ల అంతులేని అనురాగం. రాజసభలో వుండేవాడైనా, పెద్ద అమీరైనా అతడు ఏ మాత్రం తీరిక దొరికినా భారతీయ ప్రజల్లో కలిసిపోయేవాడు. ఇక్కడి భాషల శబ్దాలు కొన్నింటిని ఫారసీ, అరబీ, తుర్కీ శబ్దాలతో కలిపి భావ వ్యక్తీకరణం కోసం అతడొక కొత్త భాషను తయారు చేసినాడు. ఆ భాష అతని కంటే ప్రజలకే ఎక్కువ అవసరం. అతడు రాజదర్బారులో వుండేవాడు గనక

పలు భాషల ప్రజలు, అతని ద్వారానే తమ అవసరాలను ప్రభుత్వానికి విన్నవించుకొనేవారు. అతడు దిల్లీలో నెలవై ఉన్న హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా అనే సూఫీ యోగికి దగ్గరివాడు. తమ ఆధి వ్యాధులను గురించి, నివారణోపాయాలను గురించి, పరతత్వ జ్ఞానం గురించి అమీర్ ఖుస్రూ ద్వారానే ఆ సిద్ధ పురుషుని ఆదేశాలను, ఉపదేశాలను తెలుసుకునే ప్రయత్నం చేసేవాళ్ళు ప్రజలు. ఇలా తయారైన భాషను అమీర్ ఖుస్రూ 'హిందుయీ' అన్నాడు. దానికి ఆ కాలం వాళ్ళు హిందీ, హిందుస్తానీ- జబానె హిందుస్తాన్ అని మరికొన్ని పేర్లు పెట్టినారు. ఆ భాషే తరువాత ఉర్దూ, హిందీ భాషలకు మూలభాష అయింది.

సుల్తాను సేనలో పలు ప్రాంతాల, పలు భాషల సైనికులుండే వాళ్లు. వాళ్లొక ఉమ్మడి భాషను తయారు చేసుకున్నారు. సేనను లష్కరు అంటారు గనక ఆ భాషను లష్కరీ జుబాన్ అన్నారు. అది కూడా ఉర్దూకు మూల భాషే అయింది.

రాజమహల్లలో బేగంలకు, అంతఃపుర స్త్రీ జనానికి అవసరమైన వస్తువులను అమ్మే దుకాణాలు వెలిసినవి. అక్కడ క్రయవిక్రయాల సందర్భంలో ఒక కలగాపులగం భాష యేర్పడటం సహజం. దానిని మహల్లాతీ జుబాన్ అని, బేగమాతీ జుబాన్ అని పిలిచేవాళ్లు. అది కూడా ఉర్దూకు మూల భాష అయింది.

ఇన్ని రకాలుగా యేర్పడిన కలగాపులగం భాష పద్నాలుగవ శతాబ్దిలో సుల్తాన్ మొహమ్మద్ బిన్ తుగ్లక్ వెంట దక్కనుకు వచ్చింది. తుగ్లక్ దక్కన్‌పై దండెత్తి వచ్చి, దేవగిరిని దౌలతాబాద్‌గా మార్చి, దిల్లీ ప్రజలందరిని బలవంతంగా దౌలతాబాద్‌కు తరలించినాడు. దౌలతాబాద్‌నే తన రాజధాని చేసుకున్నాడు. కొన్నాళ్లలోనే అతని మనసు మారింది. మళ్లీ దౌలతాబాద్‌కు చేరుకున్న దిల్లీ ప్రజలను దిల్లీకి తరలించి దాన్నే రాజధానిగా చేసుకున్నాడు. ఈసారి వచ్చిన ప్రజలందరూ దిల్లీకి వెళ్ళలేదు. చాలామంది దేవగిరిలోనే వుండిపోయినారు. వాళ్ల వెంట వచ్చిన భాష దక్కను భాషలో కలిసిపోయింది. మహారాష్ట్ర ప్రజలు మాట్లాడేదే మహారాష్ట్ర ప్రాకృతం. దాని మీద హిందుస్తానీ భాష ప్రభావం చాలా పడింది. మరాఠీలో ఫారసీ శబ్దాలు, హిందుస్తాన్ శబ్దాలు చాలా కలిసే పోయినవి. మరాఠీ సంత్ కవుల భావాలు, సూఫీ కవుల భావాలు చాలావరకు సౌమ్యం కలవి. కనుక మాట్లాడే భాష మీదనే కాక హిందుస్తానీ భాష సంత్ వాఙ్మయాన్ని కూడా ప్రభావితం చేసింది. తెలుగులో గౌరవ వాచక శబ్దంగా 'గారు'ను ప్రయోగిస్తున్నాము. మరాఠీలో సాహెబ్ అనటం పరిపాటి అయింది. సాహెబ్ అరబీ శబ్దం. హిందుస్తానీ ద్వారా మరాఠీలో చేరింది. అన్నా సాహెబ్, అప్పా సాహెబ్, ఆయి సాహెబ్ అంటారు మరాఠీలో. స్త్రీలను సాహిబా అనాలె. కాని మరాఠీలో సాహెబ్ అనే అంటారు. లెక్కలేనన్ని హిందుస్తానీ శబ్దాలు మరాఠీలో మరాఠీ శబ్దల్లాగే ప్రయోగంలో ఉన్నాయి.

తుగ్లక్ వంశం బలహీనమైనంతనే దక్కనులో ఒక ముస్లిం రాజ వంశం తన అధికారాన్ని స్థిరపరచుకున్నది. దాని పేరు బహమనీ వంశం. ఈ వంశం సుల్తానులు పాలించే కాలంలోనే ఇక్కడి ప్రజల ఉమ్మడి భాష (హిందీ లేదా హిందుస్తానీ) రాజ భాషా గౌరవాన్ని పొందనారంభించిందని ఫరిష్తా తన చరిత్రలో రాసుకున్నాడు. కొన్నాళ్ళలోనే బహమనీ రాజ్యం ఐదు భాగాలుగా విడిపోయింది. భాషా సాహిత్యాల దృష్టితో మనకు రెండు భాగాలే ముఖ్యమైనవి. బీజాపూర్, గోల్కొండ. కనుక ఈ సంస్థానాల గురించే మాట్లాడుకుందాము.

పద్నాలుగవ శతాబ్ది చివరి భాగాన దిల్లీ నుంచి ఒక సూఫీ యోగి దక్షిణానికి దిగి వచ్చి గుల్బర్గాలో స్థిర నివాసమేర్పరచుకున్నాడు. అతని పేరు హజ్రత్ ఖ్వాజా బందా నవాజ్ గేసూ దరాజ్. అతడు సిద్ధ పురుషుడని ప్రతీతి. నలువైపుల నుంచి ఆర్తులైన ప్రజలు అతని ఖాన్ఖాహ్ చుట్టూ చేరటం సహజమే. దిల్లీలో హజ్రత్ నిజాముద్దీన్ ఔలియాను పరివేష్టించే జనాన్ని గురించి మాట్లాడుకున్నాము గదా. ఔలియా సంప్రదాయానికి చెందినవారే గేసూ దరాజ్. చిష్తియా సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని మొట్ట మొదట మన దేశానికి తెచ్చిన మహనీయుడు హజ్రత్ ఖ్వాజా మొయీనుద్దీన్ చిష్తీ. ఖ్వాజా గరీబ్ నవాజ్ అంటారు. అతడు దిల్లీలో కొన్నాళ్లుండి చివరికి అజ్మీర్ చేరుకున్నాడు. అతని శిష్యుడు హజ్రత్ ఫరీదుద్దీన్ గంజ్ షకర్. అతని శిష్యుడు హజ్రత్ నిజాముద్దీన్ ఔలియా. అతని శిష్యుడు హజ్రత్ నసీరుద్దీన్ చిరాగ్ దహెల్వీ. అతని శిష్యుడు హజ్రత్ గేసూ దరాజ్.

ఈ సూఫీ ఫకీర్ల గురించి ఇంతగా ఎందుకు వివరిస్తున్నానంటే, దకనీ భాషకు సాహిత్య గౌరవం కలిగించిన వాళ్లు వీళ్లే కనుక. ఈ సూఫీ యోగులు ప్రజల మధ్య తిరగటమే సన్మార్గం చూపటానికి. వీళ్లకు ప్రజలు కావాలె. ప్రజలకు వీళ్ళు కావాలె. వీళ్ల మధ్య ఒక భాష కావాలె. హజ్రత్ గేసూదరాజ్ అరబీ ఫారసీ భాషలో మహా పండితుడు. ప్రజల భాష దకనీ (దాన్నతడు హిందీ అన్నాడు) లో చక్కగా మాట్లాడగలవాడు. నోటి మాటలు గాలిలో కలిసిపోతాయి. రాబోయే తరాల కోసం రాసి పెట్టాలె. హజ్రత్ ఆ పనే చేసినాడు. అనేక గద్య రచనలు అతనివిగా ప్రచారంలో ఉన్నవి. "మేరాజుల్ ఆషిఖీన్" అతని రచన అని నమ్ముతున్నారు. దకనీ భాషలో మొదటి రచయిత హజ్రత్ ఖ్వాజా బందా నవాజ్ గేసూ దరాజ్. అతని వంశీయులనేక గద్య పద్య రచనలు

చేసినారు. బీజాపూర్‌ను పాలించిన ఆదిల్ షాహీ ప్రభువులు, గోలకొండను పాలించిన కుతుబ్షాహీ ప్రభువులు ఢిల్లీ సుల్తానుల వలెకాక ఈ దేశాన్ని తమ దేశంగా, ఇక్కడి ప్రజలను తమ వాళ్లుగా భావించినారు. కీలకమైన పదవుల్లో కూడా ఇక్కడి సమర్థులనే నియమించినారు. ఇక్కడి మట్టిని, నీటిని, గాలిని ప్రేమించినారు. ఈ రెండు రాజ్యాల సుల్తానులు స్వయంగా రాసిన కవితల్లోనూ ఆస్థాన కవుల చేత రాయించిన కావ్యాల్లోనూ ఇక్కడి ప్రకృతిలోనే ప్రవేశపెట్టినారు. చెట్లిక్కడివే. పక్షులిక్కడివే. పండుగలు, పద్యాలు ఇక్కడివే. తాను రచించిన కవితలన్నింటిని సంకలనం చేసుకున్న మొదటి కవి సుల్తాన్ మొహమ్మద్ ఖులీ కుతుబ్షా. అతని తల్లి భాగీరథి. అతడు ప్రేమించిన స్త్రీ భాగమతి. ఆమె పేర ఒక నగరాన్ని స్థాపించాడు. అదే భాగ్యనగరం. ఆమెను వివాహమాడి జనానాలో చేర్చుకున్నప్పుడామెకు హైదర్ మహెల్ అనే బిరుద నామాన్ని ప్రసాదించినాడు. భాగ్యనగరం హైదరాబాద్ నగరమైంది. చెరువు చేపలతో నిండినట్లు తన నగరం ప్రజలతో నిండి పోవాలని దేవుణ్ని ప్రార్థించినాడు. అతని ప్రార్థనకు దేవుడు ఉదారంగా స్పందించినట్లున్నాడు. అతని తల్లి భాగీరథి అన్నాను కదా! ఆమె ఒక నృత్యాంగన. ఆమెను అతని తండ్రి సుల్తాన్ ఇబ్రాహీం కుతుబ్షా ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఇబ్రాహీం సౌందర్య రసికుడే కాక సాహిత్య పోషకుడు కూడా. ఫారసీ దకనీ తెలుగు కవులతన్ని మలికిభరాముడు అని అనేక పద్యాలలో కీర్తించినారు. అతడు అతని సర్దారు అమీన్‌ఖాన్ తెలుగు కావ్యాలను అంకితంగా గ్రహించటమేకాక రచయితలకు మడి మాన్యాలు, ధనకనక వాహనాలిచ్చి సత్కరించినారు. వాళ్ల కాలంలో వున్న ముఖ్యులైన తెలుగు కవులు సారంగు తమ్మయ్య. పొన్నకంటి తెలగన. కందుకూరి రుద్రకవి- మరింగంటి సింగరాచార్యులు మొదలైనవారు.

తెలుగు కవులకు అతని పట్ల గల అభిమానాన్ని తెలిపే చాటు పద్య మొకటి లభిస్తున్నది. ఇది అతడు మరణించినప్పుడు రాసింది.

రార! విధాత! యోరివినరా! తగురా? తలకొట్టమారి!

నిస్సారపు లోభిరాజులను జంపక మల్కిభరామ భూవరున్

జారు యశోధనున్ సుగుణి జంపితి వర్థులకేమి దిక్కురా!

చేరిన నింత రాజును సృజింపగ నీ తరమా వ సుంధరన్

సుల్తాన్ ఇబ్రాహీం కులీ కుతుబ్షా కొడుకైన సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్షా ఫారసీ, దఖనీ, తెలుగు భాషల్లో కవిత్వం రాసే వాడని అతని పద్యాల సంఖ్య లక్ష వరకుంటుందని అతని సాహిత్య చరిత్రకారులు రాసినారు. ఇప్పుడతని దీవానులో అన్ని పద్యాలు లేవు. తెలుగు కవిత అలభ్యం. అతని దఖనీ కవితలో గజల్‌లే కాక అన్ని రకాల ఛందోరీతులున్నవి. అతని గజల్ల లోంచి రెండు మూడు పేర్లు ఉదాహరణగా ఇక్కడ రాస్తాను.

పియావాజ్ ప్యాలా పియా జాయెనా

పియావాజ్ ఎక్‌తిల్ జియాజాయెనా

నహీ ఇష్క్ జిస్‌కో బడాకోర్ హై

కథీఉస్ సె మిల్ బైసియాజాయెనా

కుతుబ్షా న దే ముఝ్ దివానేకు పంద్

దివానేకు కుచ్ పంద్ దియా జాయెనా.

ఈ మూడు షేర్ల తాత్పర్యమేమిటంటే ప్రేయసి చెంతలేకుండా మద్యపానం చేయరాదు. ఒక క్షణమైనా జీవించరాదు. మనసులో ప్రేమలేని వాడు వ్యర్థుడు. వాని సరసన ఎప్పుడూ కూర్చుండ రాదు, కుతుబ్షా, పిచ్చివాణ్ణయిన నాకు ఉపదేశం చేయకు పిచ్చివానికి ఉపదేశం చేయరాదు.

పై మూడు షేర్లలో కవి ఉపయోగించిన శబ్దాలను గమనించండి. వాజ్ అనే మాట ఇప్పుడు ఉర్దూలో లేదు. కథీ- బైసియా అనే మాటలు మహారాష్ట్ర ప్రాకృతం లోంచి గ్రహించబడినవి.

కుతుబ్షా కవితలో సూఫీల మధుర ప్రేమ కావలసినంత వున్నది.

దఖ్ ఏక్‌హై పర్ ఏక్‌క ధన్ లాఖ్ చమన్ హై

లఖ్ జ్యోత్ హై హర్ ఠార్ వలే ఏక్ రతన్‌హై

రక్షకుడొక్కడే కాని అతడు రక్షించేవి లక్షలాది తోటలు, రత్నమొక్కటే కాని ఆ జ్యోతి వెలుగు లక్ష దిక్కులకు ప్రసరిస్తున్నది.

కిస్ ఠార్ మె దిస్ తానహీ హర్ ఠార్ హై భర్‌పూర్

దేఖన్ కో సకత్ కా ఉసే బస్ ఏక్ నయన్‌హై.

అన్ని వైపుల నిండివున్న అతన్ని ఈ ఒంటికన్నుతో ఎలా చూడగలం? అతడు లేనిదెక్కడ? "దేఖన్ కొ సకతాకా" అనే మాటలను ఇప్పటి ఉర్దూలో దేఖ్ సక్తే క్యా? అంటున్నాము.

కులీ కుతుబ్షా ఆస్థానంలో వఝి అనే గొప్ప కవి ఉండేవాడు. అతడు దఖనీ భాషలో ఖుతుబ్ ముస్తరీ అనే మస్నవీని (ప్రబంధం) రచించి తన సుల్తాన్ ప్రేమ వ్యవహారాలకు కల్పన జోడించి ఒక అందమైన ప్రేమ కావ్యాన్ని దఖనీ సాహిత్య భాండారంలో నిలిపినాడు. సబ్‌రస్ అనే వేదాంత గ్రంథాన్ని వచనంలో రాసినాడు. తన భాష హిందీ అన్నాడు. అలాంటి రచన హిందీ భాషలో తానే మొదట చేస్తున్నట్లు చెప్పుకున్నాడు.

"అజ్ లగన్ కోయి ఇస్ జహాన్ మె, హిందూస్తాన్‌మె, హిందీ జుబాన్ మె, ఇస్ లతాఫత్ ఇస్ చందాసూ నజమ్ ఔర్ నసర్ మిలాకర్ బులాకర్ నహీ బోలియా." అంటే ఇందులో కొన్ని పేర్లు కూడా ఉన్నవి. ఇది చంపూ కావ్యం. గులిస్తాన్ లాంటి వచన కావ్యం. ఖుతుబ్షాహీల కాలం నాటి ఇద్దరు గొప్ప కవులు రమణీయాలైన మస్నవీలు రాసినారు. ఒకడు గౌవసీ, ఇంకొకడు ఇబిన్నిషాతీ- ఆదిల్షాహీ సుల్తానులు గౌరవించిన కవుల్లో రుస్తుమీ, నుస్రతీ, హాష్మీలు గొప్ప గొప్ప మస్నవీలు రాసిన మహాకవులు. ఈ చిన్న వ్యాసంలో వాళ్ల కవిత నమోనాలు చూపటం, వాళ్ల రచనలను పరిచయం చేయటం సాధ్యం కాదు.

దఖనీ భాషలో ప్రసిద్ధిగాంచిన కవులెందరో వున్నారు. అందరిలో అధిక ప్రసిద్ధి చెందినవాడు వలీదఖనీ. అతని కాలంలో బహెరీ, షిరాజ్ ఔరంగాబాదీ అనే కవులు కూడా వుండిరి కానీ వలీని దఖనీ ఉర్దూలో కవి బ్రహ్మగా గౌరవించినారు. అతడు కులీ కుతుబ్షా కంటే ఒక శతాబ్ది తరువాతి వాడు. అతడు అధికంగా గజల్లే రాసినాడు. అతని గజల్ల సంకలనం అతి సుందరమైనది. ఫ్రెంచి భాషా తత్వవేత్త 'గార్సా-ద-తాసా'వలీ దీవాన్‌ను ముద్రించు కొని ఫ్రెంచి భాషలో విపులమైన పీఠిక రాసినాడు. వలీ జన్మస్థలాన్ని గురించి, అతని పేరు గురించి ఇప్పటికీ సరిగా తెలియదు. సాహిత్య చరిత్రలు రాసిన మీర్ తఖీ మీర్, మీర్ హసన్, ముస్హఫీ మొదలైనవాళ్లు కొందరు అతని జన్మస్థానం ఔరంగాబాదన్నారు. కొందరు అహమద్ నగర్ అన్నారు. అతని పేరు షంషుద్దీన్ అని ఒకరంటే, షంషువల్లీ ఉల్లా అని ఇంకొందరన్నారు. తరువాతి కాలంలో పరిశోధనల వల్ల కొన్ని ఆధారాలు దొరికినవి. అతని పేరు షంషుద్దీన్ అని, అతని జన్మస్థానం అహ్మద్‌నగర్ అని నిర్ణయింపబడింది. దఖనీ భాషను కూలంకషంగా పరిశోధించిన వారు ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మొహియుద్దీన్ జోర్, అతని శిష్యప్రశిష్యులు ప్రొఫెసర్ రఫియా సుల్తానా, ప్రొఫెసర్ సయ్యదా జాఫర్ మొదలైనవారు.

వలీ తొలినాళ్ల కవిత ఆద్యులైన దఖనీ కవుల భాషలో వుండేది. కానీ రానురాను అతని భాషలో ఢిల్లీలో తయారయిన భాష అధికంగా చేరింది. అరబీ, ఫారసీ పదాలు కూడా అధికమయినవి. భారతీయ వాతావరణం బదులుగా ఈరాన్ వాతావరణం దిగింది. హంసలు, నెమళ్లు, చిలుకలు, కోయిలలు కాక బుల్‌బుల్- హుమా- షాహీన్ మొదలైన పక్షులు ప్రవేశించినవి. బంతిపూలు, మల్లెలు, మొల్లలు కాక గుల్, గులేలాలాలు ప్రవేశించినవి. దీనికి కారణం అతడు తరచుగా ఔరంగాబాద్‌కు, ఢిల్లీకి పర్యటించడమే. ఔరంగాబాద్‌లో అప్పటికే ఢిల్లీ భాష చేరింది. ఢిల్లీలో షాహ్ గుల్షన్ అనే సూఫీ యోగి వలీకి ఆధ్యాత్మిక గురువు. అతని ఆదేశం ప్రకారమే వలీ తన దఖనీ కవిత ముఖాన్ని ఈరాన్ వైపు మరల్చినాడంటారు. అంటే తెలుగులో నన్నయ భట్టు చేసిన పనే వలీ చేసినాడు. నన్నయ తెలుగును ప్రక్కకు నెట్టి సంస్కృతాన్ని అధికాధికంగా తెలుగులో చొప్పించినాడు. వలీ ఆ పనే చేసినాడు. అయితే వలీ కారణంగా దఖనీ ఉర్దూకు గట్టి దెబ్బ తగిలినా, వలీ కారణంగానే ఢిల్లీ ఫారసీ కవులు ఉర్దూలో గజల్లు చెప్పే సాహసం చేసినారు. అంతవరకు ఢిల్లీలోని ఫారసీ కవులు గజలులో చెప్పవలసిన గంభీరమైన, సున్నితమైన, శృంగారపరమైన భావాలను హిందూ దేశంలో జన్మించిన ఒకానొక భాషలో చెప్పటం సాధ్యం కాదని భావించేవాళ్లు. దఖనీ ఉర్దూలో వలీ చెప్పే గజల్లు ఫారసీ గజల్లకు తీసిపోకుండా ఉండటం గమనించి వాళ్లు తమ ఉర్దూలో గజల్లు చెప్పటం ప్రారంభించి నారు. ఉత్తరాది ఉర్దూను దక్కనుకు తెచ్చిన మొదటి కవి వలీ దకనీ.

ఆసిఫ్‌జాహ్ నవాబుల కాలంలో ఉత్తరాది కవులు హైదరాబాద్‌కు ఆహ్వానించబడి ఆశించిన దానికంటే ఎన్నో రెట్లు అధికంగా డబ్బు సంచులు పట్టుకువెళ్లినారు. అలాంటి వాళ్లలో జోఖ్ గురువు షాహ్‌నసీర్ ముఖ్యుడు. హైదరాబాద్ నగరంలోని షియాలు ప్రఖ్యాత మస్నవీ రచయిత మీర్ అనీస్‌ను ఆహ్వానించి కొన్నాళ్లు తమ అతిథిగా నిల్పి గౌరవించినారు. ప్రధాన మంత్రులైన దీవాన్ చందూలాల్ షాదాః, రాజీ కిషన్ ప్రసాద్ షాద్ మంచి కవులే కాక కవులను ఉదారంగా ఆదరించేవాళ్లు. ఢిల్లీ, లఖ్నో కవుల రాకపోకలతో హైదరాబాద్‌లోను చాలామంది కవులు తయారయినారు. ఆరవ నిజాం మహబూబ్ అలీ పాషా కాలంలో దాగ్ దహెల్వీ వచ్చి నిజామ్‌కు ఉస్తాదయినాడు. అతని మిత్రుడు లఖ్నోకు చెందిన అమీర్ మీనాయి హైదరాబాద్‌కు వచ్చినాడు కాని కొలది కాలంలోనే మరణించినాడు. అతని శిష్యుడు జలీల్ మాణిక్‌పూరీ ఏడవ నిజాము గురువయినాడు. జలీల్ కొడుకుల్లో అలీ అహ్మద్ జలీలీ ఇప్పటి గొప్ప కవి. హాలీ కొంతకాలం హైదరాబాద్‌లో నివసించినాడు. సయ్యదలీ బిల్‌గ్రామీ, అబ్దుల్ హలీమ్ షరర్, మీర్జా హాదీ రుస్వా (ఉమ్రావ్ జాన్ అదా అనే సుప్రసిద్ధ నవలా రచయిత) మొదలయినవాళ్లు హైదరాబాద్‌లో ఉన్నతోద్యోగాలు చేస్తూ సాహిత్య రచన చేసినారు. ఉర్దూ మీడియమ్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపించబడి నప్పుడు యూనివర్సిటీ వివిధ శాఖలకు సంబంధించిన గ్రంథా లను ఉర్దూలో అనువదించటానికి గాను "దారుత్తర్జుమా" (ట్రాన్స్‌లేషన్ బ్యూరో) స్థాపించబడింది. ఢిల్లీ, లఖ్నోలేకాక,

ఉత్తరాన గల అన్ని నగరాల నుంచి కవులూ, రచయితలూ, విద్వాంసులూ, శాస్త్రవేత్తలు హైదరాబాద్‌కు రప్పించబడినారు. ఫాన్ బదాయూనీ, జోష్‌మలీహాబాద్, సిద్ధ్ జాయెసీ లాంటి కవులు ప్రిన్స్ మొఅజ్జం జా దర్బారులో ఆస్థాన కవులుగా చేరినారు. ఫాన్ హెడ్మాస్టర్‌గా పనిచేసినాడు. ఆ కాలంలో ఉత్తరాది నుంచి ఎందరో కవులు వచ్చేవాళ్లు. హజ్రత్ అమ్జద్ హైదరాబాదీ, మఖ్దూమ్ మొహియుద్దీన్, వజ్ద్ ఔరంగాబాద్, సులేమాన్ అరబీ, అలీ అహ్మద్ జలీలీ, నజరతీ అదీల్, ఖ్వాజా షౌఖ్, మనోహర్‌లాల్ బహార్, జహాదార్ అఫ్సర్ మొదలైన కవులనేకులు ఇక్కడివాళ్లే. ఇంకా చాలామంది వున్నారు కాని వాళ్ళందరిని గురించి గాని, ఆ ఉర్దూను గురించి గానీ రాయటం నా వ్యాసం పరిధిలోకి రాదు. ఉత్తరాది నుంచి వచ్చిన కవులూ, రచయితలూ హైదరాబాద్ ఉర్దూలో దకనీ లక్షణాలున్నందున పరిహసించే వాళ్లు. కాబట్టి హైదరాబాదీయులు తమ భాష దకనీని మాట్లాడటానికి బిడియపడి ఉత్తరాది ఉర్దూను మాట్లాడటమే గౌరవప్రదమనుకున్నారు. అయినా, ఇప్పటికీ హైదరాబాద్ వాసుల వాక్య నిర్మాణం, క్రియలు చాలావరకు దక్కనీ ఉర్దూవే. ఆంధ్ర ప్రాంతంలో వుండే ముస్లిముల ఉర్దూ భాషలో దక్కనీ యాస, దకనీ వాక్య నిర్మాణం, దకనీ క్రియా ప్రయోగం చాలా ఉన్నది. ఉత్తరాది ఉర్దూ వాళ్ళు పరిహసించినా దకనీ ఉర్దూ మాట్లాడే వాళ్ళు బిడియ పడనవసరం లేదు. అమూల్యమైన, బహువిధమైన సాహిత్య సంపద గల భాష మన దకనీ ఉర్దూ. ఈ భాష ఎవరికైనా గర్వకారణం.

**(సంచిక 5-1-2001 గీటురాయి 'ఆంధ్రప్రదేశ్ ముస్లిములు' ప్రత్యేక సంచిక నుంచి...)**

# మతాన్ని మానవుల మధ్య సమరసతా వారధిగా చేయాలి

## ఎంపిజె ఆధ్వర్యంలో జరిగిన ఆలిండియా సదస్సులో మేధావులు, సామాజిక కార్యకర్తల పిలుపు





మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సలీముల్ హిందీ అందించిన సమాచారం ప్రకారం ఫిబ్రవరి 11వ తేదీన మహారాష్ట్ర జలగాంవ్‌లోని ఛత్రపతి సంభాజీ కన్వెన్షన్ హాల్‌లో ఎంపిజె ఆధ్వర్యంలో ఆలిండియా కన్వెన్షన్ నిర్వహించబడింది. ఈ సదస్సునుద్దేశించి ప్రముఖ మేధావులు, సామాజిక కార్యకర్తలు ప్రసంగించారు.

ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ అరుణ్‌కుమార్, ప్రసిద్ధ మహిళా సమాజ సేవకురాలు యుగోనీ ఖాలూకర్, రైతు నాయకుడు జైజావింధ్య, ఆదివాసీ సముదాయ కార్యకర్త ప్రతిభా షిండే తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశ పరిస్థితులపై సింహావలోకనం చేశారు.

జమాఅతె ఇస్లామీ హింద్ జాతీయ ఉపాధ్యక్షులు ఇంజనీర్ సలీమ్ అధ్యక్ష ప్రసంగం చేస్తూ ఈనాడు వైషమ్యాన్ని పెంచి పోషించేవారు దేశభక్తులుగా చెలామణి అవుతున్నారనీ, అధికారంలో ఉన్న ఫాసిస్టు శక్తులు మీడియా మద్దతుతో ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. మతం ద్వారా ప్రజల మధ్య సామరస్యాన్ని, సంఘీభావాన్ని సృజించాలని, కాని నేడు మతం ఆధారంగా ప్రజల మధ్యన వేర్పాటు సృష్టించే ప్రయత్నాలు జరగటం విచారకరమని సలీం ఇంజనీర్ ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వ సిద్ధాంతం ఆధారంగా దేశాన్ని పటిష్టవంతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన నొక్కి వక్కాణించారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

53 ఆయత్‌లు

# 42. అష్ షూరా

మక్కా అవతరణ

44 – 46 ఎవరినయితే అల్లాహ్ మార్గవిహీనతలో పడవేస్తాడో అతడిని ఆదుకునేవాడు అల్లాహ్ తరువాత మరెవడూ లేడు. నీవు గమనిస్తావు, ఈ దుర్మార్గులు శిక్షను చూసినప్పుడు అంటారు, ఇప్పుడు మరలే మార్గమేదయినా ఉందా అని.[70] ఇంకా వీరిని నరకం ఎదుటికి తీసుకువచ్చినప్పుడు నీవు గమనిస్తావు, అవమాన భారంతో క్రుంగిపోతూ ఉంటారు, చూపులు తప్పించుకుంటూ దాన్ని క్రీగంట చూస్తారు.[71] ఆ సందర్భంలో విశ్వసించినవారు అంటారు, వాస్తవానికి అసలు నష్టపోయేవారు, నేడు ప్రళయదినాన తమ్ము తామూ, తమ సంబంధీకులనూ నష్టానికి గురిచేసినవారే. బాగా తెలుసుకోండి, దౌర్జన్యపరులు శాశ్వత యాతనకు గురయి ఉండగా అల్లాహ్‌కు ప్రతిగా సహాయపడేవారూ, సమర్థకులూ, సంరక్షకులూ, వారికి ఎవరూ ఉండరు. అల్లాహ్ ఎవరిని మార్గవిహీనతలో పడవేస్తాడో అతనికి తప్పించుకునే మార్గమేదీ లేదు.

47 – 48 అంగీకరించండి, మీ ప్రభువు మాటను, ఆ దినం రాకపూర్వమే, అది తొలగిపోయే మార్గమేదీ అల్లాహ్ పక్షాన లేనేలేదు.[72] ఆ రోజున మీకు ఆశ్రయ స్థలం ఏదీ ప్రాప్తం కాదు, మరి మీ స్థితిని మార్చే ప్రయత్నం చేసేవాడూ మరొకడు ఉండడు.[73] ఇప్పుడు ఈ జనులు ఒకవేళ విముఖులయినట్లయితే, ప్రవక్తా, మేము నిన్ను వీరిపైన కాపలాదారునిగానయితే నియమించి పంపలేదు కదా![74] నీ బాధ్యత అయితే కేవలం మాటను చేరవేయడం వరకే. మానవుని పరిస్థితి ఏమిటంటే, మేము అతనికి మా కారుణ్యాన్ని చవిచూపించినప్పుడు అతను ఉబ్బిపోతాడు, మరి ఒకవేళ అతను చేజేతులా చేసుకుంది ఏదయినా విపత్తు రూపంలో అతనిపై తిరగబడితే అతి హీనమయిన కృతఘ్నుడయిపోతాడు.

70. అంటే, నేడు మరలివచ్చే అవకాశముంది, అటువంటప్పుడు వీరు మరలడానికి నిరాకరిస్తున్నారు. రేపు తీర్పు జరిగినప్పుడు, శిక్షా ఆదేశం విధించబడినప్పుడు అప్పుడు తమకు జరిగిన శాస్తి చూసి తమకు మరిలే అవకాశం దొరకాలని వారు కోరుకుంటారు.

71. మానవుని విధానం ఏమిటంటే, ఏదయినా భయానకమయిన దృశ్యం అతని ముందున్నప్పుడు, అనతి కాలంలోనే తాను ఆ కనిపించే పీడ బారిన పడబోతున్నాడని తెలుసుకుంటున్నప్పుడు ముందు భయం మూలంగా అతను కళ్ళు మూసుకుంటాడు, తరువాత అతను ఆగలేక మళ్ళీ చూడాలని ప్రయత్నిస్తాడు అది ఎటువంటి పీడో, అది ఇంకా ఎంత దూరముందోనని. అయినా తల పైకెత్తి దాన్ని నిండుగా చూడటానికి ధైర్యం చాలదు. అందువల్ల అతను మాటిమాటికీ కాస్తంత కళ్ళు తెరచి క్రీగంటి చూపులతో అలా చూస్తాడు, ఇలా భయంతో మళ్ళీ కళ్ళుమూసుకుంటాడు. నరకం వైపునకు పోయేవారి ఈ ధోరణినే ఈ ఆయత్‌లో చిత్రించడం జరిగింది.

72. అంటే, అల్లాహ్ స్వయంగానూ దాన్ని దాటజేయడు. మరెవరికీ దాన్ని దాటజేసే శక్తీ లేదు.

73. మూలంలోని పదాలు **"మాలికుమ్ మిన్ నకీర్"** ఈ మాటల్లో మరెన్నో భావాలూ ఉన్నాయి. ఒకటి, మీరు మీ చేష్టలలో దేన్నీ కాదనజాలరు. రెండు, మీరు వేషం మార్చుకుని ఎక్కడా దాక్కోలేరు. మూడు, మీ పట్ల ఏవిధంగా ప్రవర్తించినా దానికి మీరు ఎటువంటి నిరసన అయినా అయిష్టత అయినా వ్యక్తం చేయజాలరు. నాలుగు, మీరు ఏ స్థితిలో పడవేయబడతారో దాన్ని మార్చగలగటం మీ తరం కాదు.

74. అంటే, వీరిని తప్పనిసరిగా రుజుమార్గాన తేవలసిందే అన్న బాధ్యత నీపైన వేయటం జరగలేదు. వీరు ఎందుకు సన్మార్గాన రాలేదన్న విషయం పట్ల నిన్ను ప్రశ్నించటమూ జరగదు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ

**3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం**

## అధ్యాయం : 18

## మహనీయ జైద్ బిన్ హారిసా (రజి) గురించి...[1]

బరా బిన్ ఆజిబ్(రజి) ప్రవక్త మహనీయుల(సఅసమ్) నుండి ఉటంకించిన దాని ప్రకారం, ఆయన(స) జైద్ బిన్ హారిసా (రజి)తో ఇలా అన్నారు: "నీవు మా సోదరుడవు. మా మౌలావు." (ప్రాణ మిత్రుడవు)."

**371)** మహనీయ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) తెలిపారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఒక సైనిక దళాన్ని పంపుతూ, దానికి సేనాధిపతిగా ఉసామా బిన్ జైద్(రజి)ను నియమించారు. (పిన్న వయస్కుడైన) ఉసామాను సేనాధిపతిగా చేయడాన్ని కొంతమంది ఆక్షేపించినప్పుడు దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ఈ రోజు ఇతనిని సేనాధిపతిగా నియమించినందుకు మీరు ఆక్షేపణ తెలుపడం ఆశ్చర్యకరం కాదు. ఇంతకుముందు ఇతని తండ్రిని సేనాధిపతిగా నియమించినప్పుడు కూడా మీరు అభ్యంతరం తెలిపి ఉన్నారు. దైవసాక్షి! అతడు (జైద్-రజి) ఆ సమయంలో నాయకత్వానికి అర్హుడు, నాకు అందరి కన్నా ప్రియతముడు. ఇప్పుడు అతని తర్వాత ఇతను (ఉసామా- రజి) నాకు అందరికన్నా ప్రియతముడు."[1]

**372)** హజ్రత్ ఆయిషా(ర.అ) తెలిపారు: సాముద్రిక విద్యలో ప్రవేశం ఉన్న ఒక వ్యక్తి (ముద్లజీ) మా వద్దకు వచ్చాడు. ఆ సమయంలో ప్రవక్త మహనీయులు (సఅసమ్) కూడా అక్కడే ఉన్నారు. ఉసామా బిన్ జైద్, జైద్ బిన్ హారిసాలిద్దరూ ఒకే దుప్పట్లో దూరి నిద్రిస్తున్నారు. (వారిద్దరి పాదాలు తప్ప ముఖం, శరీర భాగమంతా దుప్పటి కప్పబడి ఉంది). ఆ పాదాలను శ్రద్ధగా గమనించిన సాముద్రిక శాస్త్రజ్ఞుడు, 'ఈ పాదాలు ఒండొకదాని నుంచి బయల్పడినవి' అని చెప్పాడు. ఆ మాట విన్న దైవప్రవక్త(స) ఆనందానికి అంతు లేదు. తరువాత ఆయన(స) ఆయిషా (ర)కు కూడా ఈ సంఘటనను వినిపించారు.[1]

18-1. ఈయన తన కునీయత్‌తో అబూ ఉసామాగా పిలువబడే వారు. ఎనిమిదేళ్ళ ప్రాయంలో హజ్రత్ జైద్(రజి)ను బందిపోటు దొంగలు కిడ్నాప్ చేసి మక్కాలో 400 దిర్హములకు అమ్మేశారు. హకీమ్ బిన్ హిజామ్ (రజి) ఈయన్ని కొనుగోలు చేసి, తన మేనత్త హజ్రత్ ఖదీజా (ర.అ)కు ఇచ్చారు. దైవప్రవక్త(స)తో వివాహం జరిగిన తర్వాత ఖదీజా ఈ అబ్బాయిని తన భర్తకు కానుకగా సమర్పించు కున్నారు. మొదట్లో దైవప్రవక్త(స) ఈయన్ని తన దత్తపుత్రునిగా చేసుకున్నారు. దైవప్రవక్త(స) సద్వ్యవహారానికి ముగ్ధుడైన ఆ అబ్బాయి ఒక దశలో తన కన్నతల్లిదండ్రుల వద్దకు వెళ్ళడానికి కూడా నిరాకరించాడు.

జైద్ బిన్ హారిసా(రజి) యుక్త వయస్సుకు చేరిన తరువాత దైవ ప్రవక్త(స) ఈయన వివాహాన్ని తాను స్వేచ్ఛను ప్రసాదించిన బానిస స్త్రీ ఉమ్మె ఐమన్(ర.అ)తో జరిపించారు. ఆ దంపతులకు పుట్టిన కుమారుడే ఉసామా బిన్ జైద్. ఆ తరువాత ప్రవక్త తన మేనత్త కుమార్తె జైనబ్ బిన్తె జహష్(ర.అ)ను కూడా జైద్‌కు ఇచ్చి పెళ్ళి జరిపించారు. ఆ వివాహ బంధం ఎక్కువ కాలం నిలువలేదు. అది వేరే విషయం. దివ్య ఖుర్ఆన్‌లో ఒకే ఒక సహాబీ పేరు వచ్చింది. (33:37). ఆయన ఎవరో కాదు, హజ్రత్ జైద్(రజి). ముతా యుద్ధంలో 55 ఏళ్ళ వయసులో హి.శ్రీ 8వ సంవత్సరంలో సేనాధిపతిగా వీర మరణం పొందారు.

371-1. దైవప్రవక్త(స) మరణ వ్యాధికి గురై ఉన్న రోజుల్లో సిద్ధం చేయబడిన సైనిక దళమిది. వెంటనే బయలుదేరి వెళ్ళమని కూడా ఆజ్ఞాపించారు ప్రవక్త. కాని సైనిక దళం మదీనా పొలిమేరలు కూడా దాటకముందే దైవప్రవక్త(స) పరమపదించారు. అందువల్ల ఆ సైనిక దళం మదీనాకు తిరిగి వచ్చింది. మొదటి ఖలీఫా హజ్రత్ అబూ బక్ర్(రజి) ఈ సైనిక దళాన్ని ఉసామా నేతృత్వంలోనే పంపారు. ఉసామా (రజి) విజేతగా తిరిగి వచ్చారు.

372-1. హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజి) పట్ల గల అపారమైన ప్రేమే దైవప్రవక్త(స) ఆనందానికి ప్రధాన కారణం. అదీగాక ఆ రోజుల్లో కపటులు ఉసామా బిన్ జైద్ (రజి)ను చూసి, అతను జైద్ కొడుకు కాడని ఎద్దేవా చేసేవారు. ఎందుకంటే జైద్ ఎర్రగా ఉండేవారు. ఉసామా నల్లగా ఉండేవారు. సాముద్రిక శాస్త్రజ్ఞుడు నిజాన్ని వ్యక్త పరచిన మీదట కపటులు నోరు మూసుకున్నారు. ❑

# అనువాదం ఒక కళ



- ఉమైర్

మిషన్ కాకతీయ అంటే “యంత్ర కాకతీయ” అని అనువదించడం చూసి నవ్వుకున్నాం. అనువదించిన వారి తెలుగు భాషాభిమానం గొప్పదే కాని, మిషన్, మెషీన్ అనే పదాల మధ్య తేడా గుర్తించకపోవడంతో అభాసుపాలయ్యింది. దానిపై సోషల్ మీడియాలో పెద్ద చర్చే జరిగింది. ఒకేలా ఉచ్చరించే పదాలు వాటి వాడకం గురించి సరయిన అవగాహన లేకపోతే అనువాదాల్లో జరిగే పొరబాట్లు ఇలాగే ఉంటాయి. ఇలాంటిదే ఒక అనువాదం చాలా కాలం క్రితం చదివిన గుర్తు. “రైలు పట్టాల కింద పడుకున్న పదిహేను మంది కొట్టుకుపోయారు” అనే వార్త అది. ఈ వార్త చదివిన వెంటనే మనసులో మెదిలే ప్రశ్న ఎవరైనా రైలు పట్టాల కింద ఎందుకు పడుకుంటారన్నది. పట్టాల పక్కన పడుకోవచ్చు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నవాళ్ళు, పట్టాల పైన పడుకోవచ్చు. అసలు రైలు పట్టాల కింద పడుకోవడం ఎలా సాధ్యం. అక్కడ పడుకున్న వాళ్ళు “స్లీపర్లు” అనే ఇంగ్లీషు పదానికి అనువాదమని తెలిసిన తర్వాత విషయం అర్థమైంది. పట్టాల కింద పరచిన దుంగలు వరదల్లో కొట్టుకుపోయాయి తప్ప మనుష్యులు కాదు. ఇలాంటి పొరబాట్లు రోజువారి వార్తల్లోనే జరుగుతూనే ఉంటాయి. కాబట్టి అనువాదాల్లో చాలా జాగ్రత్తగా ఉండడం ఎంతైనా అవసరం. సాహిత్య అనువాదాల్లో మరింత జాగ్రత్తగా ఉండాలి.

ఉర్దూ నుంచి అనువాదాల గురించి మాట్లాడే ముందు కాస్త ఉర్దూ భాష గురించి కూడా చెప్పడం అవసరమనుకుంటాను. హిందీ, ఉర్దూ భాషలు అక్కాచెల్లెళ్ళవంటివి. నిజానికి ఇవి రెండు భాషలు కాదు. ఒకప్పుడు పెషావర్నుంచి బెంగాల్ సరిహద్దుల వరకు సాధారణ ప్రజలు మాట్లాడిన భాషే తర్వాత రెండు ముక్కలైంది. 19వ శతాబ్దం చివరి నాటికి ఈ భాషా విభజన పూర్తయ్యిందనవచ్చు. నిజానికి ఇది ఒకే భాష. దాని పేరు హిందీ, ఉర్దూ కాదు, ఖడీబోలీ.

పర్షియనైజెడ్ ఖడీబోలి పర్షియా లిపితో రాస్తే ఉర్దూ అయ్యింది. సంస్కృతైజెడ్ ఖడీబోలీ దేవనాగరి లిపితో రాస్తే హిందీ అయ్యింది. నిజానికి ఉర్దూ అనే పేరు కూడా ఇటీవలి కాలంలో పెట్టిన పేరు. ముషాఫీ రాసిన మొదటి దీవాన్లో ఈ పేరు మనకు కనబడుతుంది. అంటే 1780లో ... కాని ఒక ప్రత్యేకమైన భాషగా కాదు. 19వ శతాబ్దం ప్రారంభంలో హిందీ, ఉర్దూ అనే పేర్లు సమానార్థకాలుగానే ఉండేవి. ఉర్దూ లేదా ఉర్దూయే ముఅల్లా అనేవి షాజహానాబాద్ నగరాన్ని సూచించే పదాలుగా కూడా ఉండేవి. జుబానె ఉర్దూ యే ముఅల్లా తర్వాతి కాలంలో ఉర్దూగా మారింది. జుబానె ఉర్దూ యే ముఅల్లా అంటే షాజహానాబాద్ ప్రజలు మాట్లాడే భాష అని మాత్రమే అర్థం. నిజానికి 18వ శతాబ్దిలో ఉర్దూయే ముఅల్లా భాష అంటే పర్షియన్, ఆ తర్వాతే ఉర్దూ ఒక ప్రత్యేక భాషగా ఏర్పడింది. హిందీ, ఉర్దూ భాషలు వేర్వేరుగా ఏర్పడడానికి కారకుడు జాన్ బోర్థ్ విక్

గిల్ క్రిస్ట్. పర్షియా లిపితో హిందూస్తాని, హిందూయీ, హైందవీ లేదా ఉర్దూ భాషను, దేవనాగరి లిపితో హిందీ భాషను విభజించిన ఘనత ఆయనదే.

ముగల్ కాలంలో, ఆంగ్లేయులు రాకముందు ఉత్తరభారతదేశంలో వివిధ ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడిన మాండలికాలు.. బ్రజ్ భాష, అవధి, మాగధి వగైరా భాషలుండేవి. ఈ భాషల ప్రభావం వల్ల ఏర్పడిందే ఖడీబోలీ. ఇప్పుడు మనం ఉర్దూగా పిలుస్తున్న భాషకు మూలం ఇదే. హిందీ, ఉర్దూ భాషల్లో లిపి భేదం మాత్రమే కాదు ఉర్దూ అటు పర్షియన్ నుంచి ఇటు అరబ్బీ నుంచి పదాలను స్వీకరించడమే కాదు కొన్ని వ్యాకరణ సూత్రాలను కూడా తీసుకుంది. సమాస నిర్మాణాలు అటు పర్షియన్ సూత్రాల ప్రకారం, ఇటు అరబీ సూత్రాల ప్రకారం కూడా చేయవచ్చు. ఈ తేడా హిందీకి భిన్నమైనది. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్న మాటను హిందీలో ఆంధ్రప్రదేశ్ కీ సర్కార్ అంటాం. ఉర్దూలో పర్షియన్ సమాస సూత్రాలతో హుకూమతె ఆంధ్రప్రదేశ్ అని రాస్తారు. అలాగే పద ప్రయోగాల్లోను తేడా కనబడుతుంది. ఖానా అనే పదం ఉర్దూలో రెండు రకాలుగా ఉచ్చరిస్తారు. ఒక ఉచ్చారణకు ఇల్లు, నిలయం అని అర్థాలు, రెండవ ఉచ్చారణకు తినడం అని అర్థం. దవాఖానా అనేది హిందీలో ఈ ఉచ్చరణ భేదాన్ని చూపుతూ రాయలేం. ఇలాంటి తేడాలు ఉండడం వల్లనే హిందీ, ఉర్దూ రెండు వేర్వేరు భాషలుగా స్థిరపడ్డాయి.

చారిత్రకంగా చూస్తే క్రీశ 1253కు చెందిన అమీర్ ఖుస్రో ఉర్దూలో మొదటి దోహాలు రాశాడు. అప్పుడు ఈ భాషను హైందవీ అనేవారు. దీన్ని అప్పట్లో హైందవీ, హిందూయీ, జబానె హింద్, రేక్తా తదితర పేర్లతో పిలిచేవారు. నిజానికి ఉర్దూ అనే పదం టర్కీ భాషా పదం. ఉరుదు అంటే శిబిరం అని అర్థం. 19వ శతాబ్దం ప్రారంభం వరకు ఉర్దూలో రాసిన వాళ్ళు కూడా తమ భాషను హిందూయీ లేదా హైందవీ అనే పిలిచారు.

ముషాఫీ ఫార్సీకో తాక్ పే రఖ్

అబ్ హై అషారె హైందవీ కా రివాజ్ అన్నాడు ముషాఫీ... వీరిద్దరు 1820 కాలం నాటి వారు. అప్పటికి ఉరుదు లేదు. ఉర్దూ హిందీ అన్న తేడా రాజకీయ కారణాల వల్ల, బ్రిటీషువారి విభజన నీతి వల్ల వచ్చిందే కాని అంతకు మించి కాదు.

హైదరాబాద్ రాష్ట్రంలోని రాజ భాష ఉర్దూ. పరిపాలన ఉర్దూలో జరిగేది. కోర్టులో వాదనలు ఉర్దూలో జరిగేవి. తీర్పులు ఉర్దూలో వచ్చేవి. ఉర్దూలో ఎన్నో న్యాయశాస్త్ర గ్రంథాలు ఉండేవి. ఉర్దూ, తెలుగూ కలిపి హైదరాబాద్ నగర వాసులు మాట్లాడే వారు.

తెలంగాణలోని తెలుగు భాషలో ఉర్దూ పదాలు ఎన్నో కనిపిస్తాయి. నిజానికి అవి తెలుగుని సంతరించుకున్నాయి. తెలంగాణ భాష మీద ఉర్దూ ప్రభావం ఎక్కువ. తెలుగువాళ్లు అసంఖ్యాకమైన ఉర్దూ పదాలను వాడుతూనే వాటిని తెలుగు పదాలని అనుకుంటున్నారు.

శ్రీశ్రీ మహాప్రస్థానంలో ఎన్నో ఉర్దూ పదాలున్నాయి. అవి తారీఖులు, దస్తావేజులూ, మతలబులు, కైఫీయతులు అలాంటివి ఎన్నో. తెలుగు కవిత్వంలోనే కాదు, తెలుగు భాషలో లెక్కలేనన్ని ఉర్దూ పదాలు ఉన్నాయి. వాటి స్థానంలో అచ్చమైన తెలుగు పదం పెట్టాలంటే ఆలోచించాల్సిన పరిస్థితే ఉంటుంది. జైలు, ఖైదీ, జామీను, వకాల్తా, ముద్దాయి, బదిలీ, జులుం, దగా, మకాం, జరిమానా, డీలా ఇలా ఎన్నో...

ఉర్దూ కవిత్వంలోని భావనా శక్తి మరే భాషలో కానరాదు. ఉర్దూ ముషాయిరాలకి ఉన్న ఆదరణ మరే కవి సమ్మేళనాలకి లేదు. గాలిబ్, షిరాక్, గోరక్ పూరీ, ఫైజ్ అహ్మద్ ఫైజ్ లాంటి కవులు, సాదత్ హసన్ మంటో లాంటి కథా రచయితలు ఉర్దూలో రాసిన వారే. ప్రేమ్‌చంద్, కిషన్ చంద్, రాజేందర్ సింగ్ బేడీ లాంటి హిందీ రచయితలు ఉర్దూ నేపథ్యం ఉన్న వారే.

రెండు శతాబ్దాలు ఉర్దూ భాష భావ వ్యక్తీకరణకి అద్దంగా నిలిచింది. రామాయణం, మహాభారతం, గీతా లాంటి గ్రంథాలు ఉర్దూలోకి అనువదించబడ్డాయి. హిందువులు, సిక్కులు ఉర్దూ భాషని పరిపుష్టం చేశారు. 1947 వరకు మనదేశంలో రాజ భాష ఉర్దూనే.

హైదరాబాద్ రాష్ట్ర హైకోర్టులో ప్రొసీడింగ్స్ ఎక్కువగా ఉర్దూలో జరిగేవి. న్యాయవాదులు వాదనలు ఉర్దూలో చేసేవారు. తీర్పులు ఉర్దూలో వచ్చేవి. ఉర్దూలో న్యాయశాస్త్ర పుస్తకాలు ఉండేవి. రెండు హైకోర్టుల విలీనం వల్ల మన న్యాయవాదులు ఇబ్బందులని ఎదుర్కొన్నారు. ఇంగ్లీషులో ప్రావీణ్యం లేక రెండవ శ్రేణిగా పరిగణించబడ్డారు. ఉర్దూ బెంచిని ఏడు సంవత్సరాలు నడిపిస్తామని చెప్పి మధ్యలోనే ఆపేశారు. ఆ విధంగా న్యాయవాదులు నష్టపోయారు. భాషా సమైక్య రాష్ట్రం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ కోర్టుల్లో పరిపాలనలో తెలుగు లేకుండా పోయింది. మన దేశీయతని సంతరించుకున్న ఉర్దూ కూడా ప్రాధాన్యం కోల్పోయింది. ఏ భాష అయినా అది ప్రజల భాష. ఉర్దూ భాష ముస్లింలది మాత్రమే కాదు. ఉర్దూ సామాన్యుల భాష. మన భాష. మాధుర్యానికి మారుపేరైన భాష. మర్యాదకీ మచ్చుతునక ఉర్దూ భాష.

ఉర్దూ నుంచి తెలుగులోకి మనకు అనువాదాలు చాలా తక్కువే కనబడతాయి. అలాగే తెలుగు నుంచి ఉర్దూలోకి కూడా. కాని ఉర్దూ భాషా ప్రభావం తెలుగుపై చాలా ఉంది. ఇంతకు ముందు

చెప్పుకున్నట్లు తెలుగులో చాలా పదాలు అవి తెలుగు పదాలే అన్నట్లుగా కలిసిపోయాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ రీడరు డాక్టర్. కె. గోపాలకృష్ణరావు గారు "తెలుగుపై ఉర్దూ పారశీకముల ప్రభావము" అనే తన గ్రంథంలో ఆదికవి నన్నయ మొదలు సి.నారాయణ రెడ్డి వరకు ఎందరో తెలుగు కవులు తమ రచనలలో ప్రయోగించిన ఉర్దూ, ఫార్సీ పదాలను సోదాహరణంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి బహుమతి పొందిన ఆ గ్రంథం ఆంధ్ర సారస్వత పరిషత్తు వారిచే 1968లో ప్రచురించబడింది. బ్రౌణ్య నిఘంటువులో కానరాని అనేక ఉర్దూ పదాలు, ఉర్దూతో మిళితమయిన తెలుగు పదాలు ఎన్నో ఈ గ్రంథంలో దర్శనమిస్తాయి. వాటన్నిటినీ వ్రాయాలంటే, వ్యాసంలో కుదరదు. మరో గ్రంథమే అవుతుంది.

మనం కూర్చునే కుర్చీ మొదలు రాసుకునే కలం, మన తహశీలుదారు, మన మంచానికి నవారు, మన ఇంట్లోని నగదు, ఇంటి బయట బాజారు, పని చేసే నౌకరు, పనిలో బేజారు ఇలా చెబుతూ పోతే తెలుగులో కలగలిసిపోయిన పదాల జాబితా ఒక గ్రంథమే అవుతుంది. అలాగే తెలుగు పదాలు ఉర్దూలో కూడా కలిసిపోయాయి. దక్కనీలో బండి అనే పదం అలాంటిదే. ఇలాంటి పదాలు ఇంకా చాలా ఉండవచ్చు. ఇంతగా ఈ రెండు భాషల మధ్య సంబంధాలున్నప్పటికీ అనువాదాలు జరక్కపోవడం ఆశ్చర్యమే.

ఉర్దూ గజల్లను గానీ, షేర్లను గానీ తెలుగులో అనువదించటం అసాధ్యం కాకున్నా కష్టసాధ్యం. ఆ కష్టం ఇంతా అంతా కాదు. అందుకు కారణం ఉర్దూ భాష స్వభావం వేరు. ఎందుకంటే ఉర్దూ కవిత ఫారసీ సాహిత్య లక్షణాలు కలిగి వుంటుంది. తెలుగు కవిత చాలావరకు సంస్కృత లక్షణాలను, కొంతవరకు దేశి లక్షణాలను కలిగి వుంటుంది. ఒక భాష కావ్య లక్షణాలు, అలంకారాలు, ధ్వని మొదలైనవి ఇంకొక భాష కావ్య లక్షణాలు, అలంకారాలు, ధ్వనీత్యాది కావ్యాంశాలు చాలా భిన్నంగా వుంటాయి.

అందుకే ఉర్దూ గజల్లను ఇతర కావ్య రీతులను అనువదించే కవికి ఉభయ భాషల కావ్య లక్షణాలు, అలంకారాలు మొదలైనవి బాగా తెలిసి వుండాలె. అవన్నీ తెలిసి వున్నందు వలన అనువాద కవి ఉర్దూ కవి హృదయాన్ని చక్కగా గ్రహించి అతడు వెలువరించ దలచిన భావాన్ని అవగాహన చేసుకోగలడు. ఆ పైన అదంతా తెలుగులో చెప్పేటప్పుడు తెలుగు కావ్య లక్షణాలను, అలంకారాలను పాటించవలసి వుంటుంది. అక్కడే కవి కష్టాన్ని ఎదుర్కో వలసి వస్తుంది. ఉర్దూ లక్షణాలను అలంకారాలను తెలుగులో ప్రవేశపెట్టలేడు. తెలుగు లక్షణాలతో, అలంకారాలతో చెప్పిన కవిత ఉర్దూ కవిత వలె వుండదు. అందుకే అన్నాను, అనువాదం కష్టసాధ్యమైన పని అని.

ఉర్దూ షేర్లకు రదీఫ్, ఖాఫియాల నియమం వుంటుంది. తెలుగులో ఆ నియమాన్ని ప్రవేశపెట్టలేము. చేయి తిరిగిన తెలుగు కవులు ఆ ఖాఫియాలకు బదులు అంత్య ప్రాస నియమం పాటించినారు.

"అల్పాక్షరముల ననల్పార్థ రచన కల్పించుటయ కాదె కవి వివేకంబు" అన్నాడు పాల్కురికి సోమన. ఇది ఉర్దూ కవితకే వర్తించే మాట. కొద్ది శబ్దాల్లో గొప్ప భావాన్ని ఆవిష్కరిస్తాడు ఉర్దూ కవి. ఏ మాటా స్పష్టంగా చెప్పడు. కానీ ఉర్దూ కావ్య సంప్రదాయాన్నెరిగిన శ్రోతలకు, పాఠకులకు ఎక్కడా అస్పష్టత కనిపించదు. ఉర్దూకవి ప్రతీకలు శ్రోతలకు, పాఠకులకు చిరపరిచితాలు. కాబట్టే వేదిక మీద నిల్చున్న కవి ప్రతీకల ఊతంతో పరిమిత పదాలలో ఏమి చెప్పబోతున్నాడో ముందే గ్రహించిన శ్రోత కవి కంటే తానే ముందు చెప్పేస్తాడు.

తెలుగు కవి సమ్మేళనంలో కవి చదువుతాడు. శ్రోతలు బుద్ధిమంతుల్లాగా మౌనంగా వింటారు. ఉర్దూ కవి రాగంలో చదివితే 'తరన్నుమ్' – వచనంలో చదివితే 'తహత్'. కవి ఎట్లా చదివినా అందులో పస వుంటే శ్రోతలు మధ్యమధ్య వహ్వా, షాబాష్, క్యా బాత్ హై అంటూ ప్రోత్సహిస్తారు. మరీ గొప్పగా వుంటే 'ముకర్రర్– ఇర్షాద్' అని రెండవసారి చదివించుకుంటారు. కొన్ని సందర్భాల్లో కవి చెప్పిన దాన్ని బట్టే ఆపైన కవి ఇంకేమి చెప్పబోతున్నాడో ఊహించిన శ్రోతలు కవి కంటేముందే చెప్పేస్తారు. ఖాఫియా రదీఫుల సహా చెప్పేస్తారు. అనువాదంలోనూ ఆ ఊపు రావాలంటే కష్టమే మరి.

అనువాదమంటే కేవలం పదానికి భావం చెప్పడం కాదు. నిజానికి కొన్ని పదాలకు సమానార్థకాలు దొరకడం కూడా కష్టమే. మూలభాష, లక్ష్యభాషల గురించి మనం సాంకేతికంగా అనువాద సమస్యలను చర్చిస్తాం. నిజానికి అనువాదమంటే ఒక సంస్కృతిని మరో సంస్కృతి వారికి పరిచయం చేయడం. సాహిత్య అనువాదం అనేది నిజానికి సంస్కృతిని అనువదించడం. ఉర్దూలో అనువాదాన్ని తర్జుమాతో పాటు ముంతఖలీ అని కూడా అంటారు. ముంతఖల్ అంటే ఒక చోటి నుంచి మరో చోటికి మార్చడం. ఒక సంస్కృతిని మరో సంస్కృతి వారి వద్దకు చేరవేయడమే సాహిత్య అనువాదం.

ప్రతి భాషకు దానిదైన మాహౌల్ ఉంటుంది. మాహౌల్ అనేది కాస్త విస్తృతమైన పదం. భాషా వాతావరణం అని మనం అనువదించుకుందాం. ప్రతి భాషకు దానిదైన ప్రత్యేక అభివ్యక్తి ఉంటుంది. ప్రత్యేక పురాగాధలుంటాయి. సిద్ధ ప్రతీకలుంటాయి. ప్రత్యేక పదాలుంటాయి. ఒక భాషలో ఉన్న పదాలన్నీ మరో భాషలో ఉండవలసిన అవసరం లేదు. అలాగే ఒక భాషలో పలుకుబడిని పోలిన పలుకుబదులు మరో భాషలో ఉండకపోవచ్చు. ఉదాహరణకు ఉర్దూలో 'అమానత్' అనే పదాన్ని తీసుకుందాం. ఈ పదం నిజానికి తెలుగులో కూడా వాడుతున్నాం. అమానతు మొత్తం అంటారు కదా. కాని ఉర్దూలో అమానత్ అనే పదానికి ఉన్న విస్తృతి వేరు. అమానత్ అంటే ఏదైనా అప్పగిస్తే దాన్ని దాచి పెట్టి మరలా యజమాని అడిగినప్పుడు అప్పజెప్పడం. అది నగదు మొత్తం కావచ్చు. ఒక వస్తువు కావచ్చు. పెళ్ళి చేసినప్పుడు వధువు తండ్రి లేదా తల్లి, వరుని తండ్రితో లేదా తల్లితో "ఆప్ కీ అమానత్ హై" అని చెప్పడం హిందీ సినిమాల్లో చాలా మంది చూసే ఉంటారు. అంటే అర్థం మీకు సంబంధించిన అమానత్‌గా మా వద్ద ఇంత కాలం ఉన్నది. ఇప్పుడు భద్రంగా మీకు అప్పగిస్తున్నామని. అలాగే ఏదన్నా మాట ఎవరికీ చెప్పవద్దని ఒక మనిషి మరొకరికి చెబితే అది కూడా అమానత్ అవుతుంది. ఆ మాటను కూడా అతను దాచిపెట్టవలసి ఉంటుంది. అలా చేయకపోతే అతను ఖియానత్ చేసినట్లు. ఈ భావాలన్నీ మనకు తెలుగు అమానతులో లేవు.

**(ఇంకా వుంది)**

# ముగిసిన ఖుర్ఆన్ కంఠస్త పోటీలు




**పిల్లలకు** చిన్నప్పటి నుంచే ఖుర్ఆన్, దైవగ్రంథాలపై అవగాహన కల్పించాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ ముహమ్మద్ దావూద్ అన్నారు. ఆదివారం విజయవాడ ఆటోనగర్‌లోని టెక్నీషియన్స్ అసోసియేషన్ హాల్‌లో యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో 9వ ఖుర్ఆన్ కంఠస్త పోటీల గ్రాండ్ ఫైనల్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెక్నాలజీలో యుగంలో నైతిక విలువలు అడుగంటిపోతున్నాయని, ఫలితంగా చిన్ననాటి నుంచే విషబీజాలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ వైద్యులు ఖాలేషావలి మాట్లాడుతూ, ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారన్నారు. చిన్ననాటి నుంచే వారిని దైవ కార్యక్రమాల వైపు మళ్లించడం వల్ల సత్సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ పోటీలలో సుమారు 100 మందికిపైగా పిల్లలు హాజరయ్యారు. ఏబీసీడీ గ్రూపులుగా విభజించారు. కార్యక్రమంలో పర్వేజ్, షేక్ బాషా, హబీబ్‌ఖాన్, పర్వేజ్‌తోపాటు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

**గ్రూప్–ఏ**

ఫస్ట్ ప్రైజ్ : ఆయెషా అహ్మద్, విశాఖపట్నం,
సెకండ్ ప్రైజ్ : ముహమ్మద్ ఆహిల్, విజయవాడ
థర్డ్ ప్రైజ్ : ఆఫియా తహరీమ్, విజయవాడ

**గ్రూప్–బీ**

ఫస్ట్ ప్రైజ్ : అతర్ జుల్ఫికర్, హిందుపూర్
సెకండ్ ప్రైజ్ : ముహమ్మద్ ఆమిన, విజయవాడ
థర్డ్ ప్రైజ్ : ఎస్‌కే సనోబర్, కర్నూలు

**గ్రూప్–సీ**

ఫస్ట్ ప్రైజ్ : ముహమ్మద్ అనీఖత్ ఇఫ్ఫత్, విజయవాడ
సెకండ్ ప్రైజ్ : ఎస్.ఆఫియా అంజుమ్, హిందూపూర్
థర్డ్ ప్రైజ్ : ఎస్‌కే అబ్దుల్ ముహైమిన్, పెడన

**గ్రూప్–డీ**

ఫస్ట్ ప్రైజ్ : ముహమ్మద్ అనస్ హుసైన్, విజయవాడ
సెకండ్ ప్రైజ్ : ఐమన్ మరియం, విజయవాడ
థర్డ్ ప్రైజ్ : కే.ఇబ్రాహీమ్, ప్రొద్దుటూరు




**కారు డ్రైవింగ్** చేయాలంటే మీరు డ్రైవింగ్ నేర్చుకోవలసిన అవసరం ఇక లేదు. ఇది మీకు వింతగా ఉండవచ్చు. ఎందుకంటే భవిష్యత్ కార్లు సెల్ఫ్ డ్రైవ్ అవుతాయి. అంటే ఆటోమెటిక్‌గా నడుస్తాయి.

30 సంవత్సరాల తర్వాత మీరు ఎలా ఉంటారో మీకు చూపించే సామర్థ్యం టెక్నాలజీకి ఉందని మీకు తెలుసా? ఫేస్‌యాప్ (Face app) ను డౌన్‌లోడ్ చేసి ప్రయత్నించండి. అద్భుతాన్ని చూస్తారు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చెప్పడానికి తాజా ఫేస్‌అప్ యాప్ ఒక ఉదాహరణ మాత్రమే. గూగుల్ అసిస్టెంట్, అలెక్సా సిరి- ఇవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ కృత్రిమ మేధస్సు ఎలా మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయో చెప్పడానికి ఉదాహరణలు.

## ఎకానమీ & ఎంప్లాయ్‌మెంట్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/ కృత్రిమ మేధస్సు ప్రభావం

రోబోట్లు శస్త్రచికిత్స చేయడాన్ని మనము త్వరలో గమనిస్తాము. అవి మానవ వైద్యుల కన్నా ఖచ్చితంగా, మెరుగైన ఆపరేషన్లు చేస్తాయి. ఉద్యోగ రంగంలో రోబోట్ల ప్రవేశంతో అకౌంటెంట్లు, స్టోర్ కౌంటర్ సేల్స్‌మెన్, కొరియర్ బాయ్స్, ట్రక్ డ్రైవర్లు అందరూ తమ ఉద్యోగాలు కోల్పోవచ్చు.

మైనింగ్, ఫైర్ ఫైటింగ్, డ్రిల్లింగ్ వంటి ప్రమాదకరమైన ఉద్యోగాలు కూడా రోబోలచే నిర్వహింపబడతాయి.

హాన్సన్ రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి ''సోఫియా'' అనే ప్రపంచంలో మొదటి హ్యూమనాయిడ్ రోబోట్‌ను అభివృద్ధి చేసింది. మరిన్ని వివరాల కోసం గూగుల్ లేదా యూట్యూబ్‌లో సోఫియా కోసం వెదకండి.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రమాదకరం కూడా?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేరస్తుల చేతుల్లో బడితే చాలా ప్రమాదకరం. వారు దానిని వారి స్వంత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ముందే, అగ్ర రాజ్యాలు జన వినాశక ఆయుధాల ద్వారా బలహీన దేశాలపై బాంబు దాడి చేసి నాశనం చేస్తున్నట్లు మనం గమనిస్తున్నాము.. సామూహిక విధ్వంసం చేసే ఆయుధాలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వర్తింపజేసిన తర్వాత యుద్ధ వినాశనం చాలా ఎక్కువగా ఉంటుంది. పెద్ద బహుళ జాతి కంపెనీలు మానవ జీవితం గురించి పట్టించుకోవు, లాభం కోసం ఏదైనా చేయగలవని చూపుతున్నాయి.

ముస్లిం సమాజం  చాలా వెనుకబడి ఉంది. కృత్రిమ మేధస్సు వలన సంభవించే ప్రయోజనాలు, నష్టాలను గ్రహించడం ప్రస్తుతం మన ముందున్న సవాలు.  అది మంచి చేతుల్లో పడితే ప్రయోజనం, తప్పుడు చేతుల్లో పడితే నష్టం.

## ముస్లిం సమాజం- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇలా అన్నారు: “కృత్రిమ మేధస్సు అనేది రష్యాకు మాత్రమే కాదు, మానవాళి అందరికీ భవిష్యత్తు. ఇది అపారమైన అవకాశాలతో వస్తుంది, కానీ దాని వలన నష్టాలూ ఉన్నాయి. ఈ రంగంలో ఎవరైతే నాయకుడవుతారో వారు ప్రపంచానికి పాలకులవుతారు. ”

టెక్నాలజీ అపారమైన ప్రయోజనాలతో వస్తుంది. కృత్రిమ మేధస్సు AI విషయంలో కూడా అంతే. ఇస్లామిక్ స్వర్ణ యుగానికి చెందిన శాస్త్రవేత్తలు తమ ఆవిష్కరణల ద్వారా సమస్త మానవాళి లేదా ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చారు. శాస్త్రీయ/సాంకేతిక వికాసంలో తమ సహకారం అందజేశారు. ఇస్లామిక్ స్వర్ణ యుగం (8-14 వ శతాబ్దం వరకు)లో జరిగిన ఆవిష్కరణలలో ఆస్ట్రోలాబ్, కంపాస్, సర్జికల్ ఇన్స్ట్రుమెంట్స్, కెమెరా, టూత్ బ్రష్ మొదలైనవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

కాని 14 వ శతాబ్దం నుండి ముస్లింలు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో వెనుకబడిపోయారు. తిరిగి ముస్లింలు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో నాయకులుగా ఎదగాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రవక్త ముహమ్మద్ (స) ప్రకారం, స్వీకరించే చేతి కంటే అందించే చేయి ఎల్లప్పుడూ గొప్పదని అన్నారు.

సాంకేతిక రంగంలో ముస్లింలు అభివృద్ధి సాధిస్తేనే సమాజంపై సానుకూల ప్రభావం చూపగలం. ముస్లింలు సమాజ ప్రయోజనం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించకపోతే  అన్ని రంగాల్లో వెనుకబడతారు.

కృత్రిమ మేధస్సు ప్రపంచంలోని పేదరికం, పరిశుభ్రమైన నీరు, వ్యాధులు, పోషకాహారం, పర్యావరణం వంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాశ్చాత్య దేశాలలో పిల్లలకు కూడా నేర్పబడుతుంది. 5వ తరగతి నుండి పిల్లలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కోర్సులు నేర్పే సంస్థలు ఉన్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) కోర్సుల్లో చేరమని ముస్లిం పిల్లలను ప్రోత్సహించాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)ని వృత్తిగా స్వీకరించమని ముస్లిం యువకులను ప్రేరేపించాలి.

అల్లాహ్ ఉపదేశించినట్లు ఈ ప్రపంచాన్ని మంచి ప్రదేశంగా మార్చడం మన కర్తవ్యం.

## TIME 100 AI జాబితాలో స్థానం పొందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తును రూపొందించే ముస్లింలు

కృత్రిమ మేధస్సులో అత్యంత ప్రభావవంతమైన 100 మంది వ్యక్తుల జాబితాను సెప్టెంబర్ 07, 2023న టైమ్ మ్యాగజైన్ విడుదల చేసింది. అనేక మంది ముస్లిం టెక్కీలు  ఆలోచనాపరులు టైమ్ మ్యాగజైన్ జాబితాలో చేరారు.

టైమ్ మ్యాగజైన్ ప్రారంభ TIME100 AI జాబితా’లో చేరిన కొందరు ముస్లిం ప్రముఖులు:

గూగుల్ డీప్ మైండ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ లీలా ఇబ్రాహీం, TIME100 AI జాబితాలో గౌరవించబడిన ప్రముఖ వ్యక్తులలో ఒకరు. టెక్ పరిశ్రమలో రెండు దశాబ్దాల అనుభవంతో, డీప్మైండ్‌లో లీలా ఇబ్రాహీం ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.

సురక్షితమైన AI సిస్టమ్‌లను అభివృద్ధి చేయడం గురించి 53ఏళ్ల లీలా ఇబ్రాహీం నొక్కిచెప్పారు.

డీప్‌మైండ్ వ్యవస్థాపకులు డెమిస్ హస్సాబిస్, షేన్ లెగ్‌లతో కలిసి AI ప్రమాదాల స్వభావాన్ని మహమ్మారితో, అణు యుద్ధంతో పోల్చుతూ ఒక ప్రకటనపై సంతకం చేశారు. డీప్‌మైండ్ బాధ్యత పాలనా ప్రయత్నాల నాయకురాలిగా లీలా ఇబ్రాహీం AI ప్రమాదాలను తగ్గించే పనిలో ఉన్నారు.



ముస్తఫా సులేమాన్ : CEO, సహ వ్యవస్థాపకుడు ఇన్ఫ్లెక్షన్.

ముస్తఫా సులేమాన్, CEO, ఇన్‌ఫ్లెక్షన్ AI సహ వ్యవస్థాపకుడు, TIME100 AI జాబితాలో మరొక ప్రముఖ వ్యక్తి.

2014లో డీప్‌మైండ్‌ను గూగుల్ కొనుగోలు చేసిన తర్వాత, సులేమాన్ AIలో గణనీయమైన కృషి చేయడం కొనసాగించారు. సులేమాన్ గూగుల్‌లో చేరారు. తర్వాత గ్రేలాక్ పార్ట్‌నర్స్‌కు చెందిన రీడ్ హాఫ్‌మన్‌తో కలిసి AI చాట్‌బాట్ స్టార్టప్ అయిన ఇన్‌ఫ్లెక్షన్‌ను స్థాపించారు. సులేమాన్ ఇటీవలి పుస్తకం "ది కమింగ్ వేవ్" ద్వారా వివిధ పరిశ్రమలు, దేశాల్లో AI తీసుకు వచ్చే మార్పులను చర్చిస్తుంది.

సులేమాన్ బాధ్యతాయుతమైన AI అభివృద్ధి ఆవశ్యకతను నొక్కిచెప్పారు. "కృత్రిమ సామర్థ్యం గల మేధస్సు" అవసరం అని వాదించారు. సంపద, ఆరోగ్యం, ఉత్పాదకతను పెంచడం ద్వారా AI సమాజానికి ప్రయోజనం చేకూరుస్తుందని సులేమాన్ అంటారు.

ఒమర్ అల్ ఒలామా, ప్రపంచంలోని మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మంత్రి. TIME100 AI జాబితాలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అల్ ఒలామా బాధ్యతలలో ప్రభుత్వం అంతటా AI అప్లికేషన్‌లను పర్యవేక్షించడం, వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటివి ఉన్నాయి. AI ద్వారా ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడంలో AI గవర్నెన్స్, అంతర్జాతీయ సహకారానికి సమగ్ర విధానం ప్రాముఖ్యతను ఒమర్ అల్ ఒలామా నొక్కి చెప్పారు.

అన్ని దేశాలను కలుపుకొని, బహుపాక్షిక చర్చలను ప్రోత్సహించడం చాలా అవసరమని అల్ ఒలామా పేర్కొన్నాడు. AI సాంకేతికత లోతైన చిక్కులను పరిష్కరించడంలో సహకారం అవసరాన్ని అల్ ఒలామా నొక్కి చెప్పాడు.

హ్యూమన్ ఇంటెలిజెన్స్ CEO, సహ వ్యవస్థాపకురాలు అయిన రుమ్మన్ చౌదరి కూడా TIME100 AI జాబితాలో చోటు సంపాదించారు. చౌదరి AI ఎథిక్స్‌లో, ముఖ్యంగా రెడ్ టీమింగ్ AI సిస్టమ్స్‌లో గుర్తింపు పొందారు. AI సిస్టమ్‌లలో సంభావ్య సమస్యలు తీవ్రమైన సమస్యలుగా మారకముందే వాటిని ముందుగానే కనుగొని వాటిని పరిష్కరించడం ఆమె లక్ష్యంగా పెట్టుకుంది.

గతంలో రుమ్మన్ చౌదరి ట్విట్టర్ మెషిన్-లెర్నింగ్ ఎథిక్స్ టీమ్‌కు అధిపతిగా ఉండేవారు. అక్కడ రుమ్మన్ చౌదరి పరిశోధన ప్లాట్‌ఫారమ్ AI అల్గారిథమ్‌లలో పక్షపాతాలను వెలికితీసింది. రుమ్మన్ చౌదరి పనికి బైడెన్ అడ్మినిస్ట్రేషన్ నుండి మద్దతు లభించింది.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# నా ఈ మహా పాపానికి నిష్కృతి లేదా?

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**ఎంత** ఘోర పాపం జరిగినా అది క్షమించబడదన్న నిరాశకు లోను కాకూడదు. పశ్చాత్తాపం, క్షమాపణకై వేడుకోలు ద్వారా, హృదయాన్ని పరిశుద్ధం చేసుకోవాలి. దైవం పట్ల పూర్తిగా నమ్మకం కలిగి ఉండాలి. నిరాశా నిస్పృహలకు గురికావడం తిరస్కారుల లక్షణం. అత్యధికంగా మన్నింపును కోరడం, ఎలాంటి పరిస్థితులలోనూ దైవం పట్ల నిరాశ చెందకపోవడం విశ్వాసుల ప్రత్యేకతలు. పాపాలు ఎక్కువయ్యాయని ఆందోళన చెంది నిరాశ పడటం, అవి క్షమించబడవని నిస్పృహకు గురికావడం మానసిక, భావపరమయిన వినాశానికి నిదర్శనం. తన ప్రియభక్తుల వల్ల అసలు పాపమే జరగదని దైవం చెప్పలేదు. వారివల్ల పాపాలు జరుగుతాయి. కాని తాము చేసింది సరైనదే అని వారు తమ పాపాలను గురించి మంకుతనం వహించరు. వారు నిజాయితీగా తమ పాపాలను ఒప్పుకుంటారు.

మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా తెలిపారు : గతించిపోయిన జాతిలో ఒక వ్యక్తి ఉండేవాడు. అతడు తొంబై తొమ్మిది హత్యలు చేశాడు. అతడు ప్రపంచంలో అందరికంటే గొప్ప విద్వాంసుడు ఎవరని ప్రజల్ని అడిగాడు. వారు దైవ భక్తుడయిన ఒక పండితుడ్ని చూపించారు. అతడు ఆ పండితుని వద్దకు వెళ్ళి అయ్యా నేను తొంభై తొమ్మిది హత్యలు చేశాను. నా 'తౌబా' స్వీకరించబడుతుందా? అని అడిగాడు. అందుకు ఆ పండితుడు 'లేదు నీ తౌబా (పశ్చాత్తాపం) అంగీకరించబడటానికి ఇప్పుడు ఎలాంటి అవకాశం లేదు' అన్నాడు. అది వినగానే ఆ వ్యక్తి నిరాశ నిస్పృహలతో ఆ పండితుడ్ని కూడా హత్య చేశాడు. ఇప్పుడు అతడు పూర్తిగా వంద మందిని హత్య చేసినవాడయ్యాడు. అతడు మళ్ళీ ప్రజల్ని అడగడం ప్రారంభించాడు. ఈ ప్రపంచంలో అందరికంటే గొప్ప మత విద్వాంసుడు ఎవరు అని. ప్రజలు అతనికి ఇంకొక పండితుడిని చూపించారు. అతడు తౌబా ఉద్దేశ్యంతో ఆ పండితుడి దగ్గరకు వెళ్ళి ఆయనకు తన పరిస్థితిని వివరిస్తూ ఇలా అన్నాడు, 'అయ్యా! నేను వంద హత్యలు చేశాను. మరి నా తౌబా అంగీకరించబడుతుందా? నా ఈ మహా పాపానికి నిష్కృతి ఉందా'? అప్పుడు పండితుడు ఇలా అన్నాడు : 'ఎందుకు లేదు, నీకూ తౌబాకు మధ్య ఉన్న అడ్డు ఏమిటి? నీవు ఫలానా దేశం వెళ్ళు, అక్కడ దేవుని ప్రియదాసులు కొందరు దేవుని ఆరాధనలో నిమగ్నులయి ఉన్నారు. వారితోపాటు నీవు కూడా దేవుని ఆరాధనలో నిమగ్నమయిపో. మళ్ళీ ఇంకెప్పుడూ నీ స్వదేశం తిరిగి రావద్దు. ఎందుకంటే ఈ స్థలం ధార్మిక దృష్టితో చూస్తే నీకు అనుకూలంగా లేదు' (అంటే ఇక్కడ నీవు నీ తౌబాపై స్థిరంగా ఉండడం, సంస్కరణకు యత్నించడం చాలా కష్టం). తరువాత ఆ వ్యక్తి (అలాగే) బయలుదేరాడు. ఇతడు ఇంకా సగం దూరమే చేరుకున్నాడు. ఈ మధ్యలో అతనికి మృత్యు సమయం ఆసన్నమయింది. ఇక అప్పుడు కారుణ్యదూతలు, శిక్షా దూతలు వాదులాడుకోసాగారు. "ఇతడు తన పాపాలకు పశ్చాత్తాపం చెంది, దేవుని వైపునకు దృష్టి కేంద్రీకరించి ఇటు వచ్చాడు' అన్నారు కారుణ్య దూతలు.

"కాదు. ఇతడు ఇంకా ఎలాంటి పుణ్యకార్యం చేయలేదు' అన్నారు శిక్షా దూతలు. ఈ సంభాషణ జరుగుతూ ఉండగా మరొక దైవదూత మానవాకారంలో అక్కడికి వచ్చాడు. కారుణ్య, శిక్షా దూతలు తమ మధ్య తీర్పు ఇవ్వడానికి అతడిని మధ్యవర్తిగా ఎంచుకున్నారు. అతడు ఇలా తీర్పు చెప్పాడు:

ఈ వ్యక్తి ఎటు నుండి వచ్చాడో అది ఇక్కడకు దగ్గరగా ఉందో, లేక ఈ వ్యక్తి చేరవలసిన గమ్యం దీనికి దగ్గరగా ఉందో కొలిచి చూడండి దైవదూతలు భూమిని కొలిచారు. అప్పుడు ఆ వ్యక్తి గమ్యమే దగ్గరగా ఉందని తేలింది. కారుణ్య దూతలు వెళ్ళిపోతూ ఆ వ్యక్తి ఆత్మను స్వాధీనం చేసుకున్నారు. దేవుడు ఆ వ్యక్తిని కటాక్షించాడు. (బుఖారీ, ముస్లిమ్)




# నేటి విద్యార్థి జీవితం

**- పోలంకి విజయభాస్కర్**

**పూర్వం** బడి అంటే అర్థం వేరు. సమాజంలో సంఘ జీవనానికి, ముక్తి మార్గానికి, శీల సంపదకు, మెరుగైన బతుకు దెరువు చూపించే వృత్తి నైపుణ్యానికి, అదే సమయంలో ధార్మిక చింతనకు ఆనాటి విద్య ఉపయోగపడేది. నేడు విద్యా స్వరూపం పూర్తిగా మారిపోయింది. చదువుకోవడం... తెలుసుకోవడం దానికది పరమార్థం కాదిప్పుడు. ఇతరులకన్నా ఉన్నత స్థానంలోనికి ఎగబాకేందుకు ఒక సాధనంగా మాత్రమే ఇవాళ విద్యను పరిగణిస్తున్నారు.

విద్యార్థి జీవితం అనేది ఎప్పుడూ సుఖమైనది కాదనే మాట నిజమే. వారి మనసు ఎల్లప్పుడూ ఆటపాటలపైనే ఉంటుంది. విద్య ఆవశ్యకతను వారికి ఓపిగ్గా చెప్పి ఒప్పించాల్సి ఉంటుంది. దారికి రానివారిని దండించైనా దారికి తీసుకురావలసిన బాధ్యత ఉపాధ్యాయులపైన, తల్లిదండ్రులపైన ఉంటుది. ఈ అవసరం రీత్యానే  విద్యా రంగంలో దండన అనే దాన్ని పరిహరించలేక పోతున్నాం. కాని విద్యార్థి క్షేమం దృష్ట్యా మనసులో గొప్ప ప్రేమతో మాత్రమే అనుసరించాల్సిన ఈ పద్ధతి కొన్నిసార్లు ఉపాధ్యాయుని శాడిజం సంతృప్తికి ఉపయోగపడడం విషాదం. ఒకప్పుడు సరిగ్గా చదవకపోతే తీవ్రమైన దండనలే ఉండేవి. పొడవైన కర్ర పట్టుకుని మాస్టారు ఈ చివర నుండి ఆ చివర కూర్చున్న విద్యార్థి నెత్తి మీద రెండు వాయించేవారు. ఇంకొంతమంది మరో అడుగు ముందుకు వేసి ముళ్ళ కర్రతో కాలి మడమ మీద కొట్టడం, డస్టర్‌తో కొట్టడం, గోడ కుర్చీ వేయించడం... తలకిందులుగా నిలబెట్టడం వంటి 'శిక్ష'లతో ఆనాటి శిక్షణ కొనసాగేది. ఇదంతా అనాగరికమని ఆధునిక యుగంలో కొన్ని చర్చలు జరిగాయి. కాని, విద్య ఒక వ్యాపారంగా పరిణామం చెందిన తరువాత కొన్ని ప్రైవేట్ స్కూళ్ళలో పరీక్షా ఫలితాలు మాత్రమే గీటురాళ్లు అయిపోయాక మునుపటి కన్నా అనాగరిక పద్ధతులు తయారయ్యాయి.

ఒకప్పుడు గురువును శిష్యుడు దేవునిలా చూసేవాడు. గురువు కూడా విద్యార్థిని తన కుమారునిలా భావించి అతని అభివృద్ధికి పూర్తి బాధ్యత వహించేవాడు. రానురాను దండన మొరటుగా తయారు కావడం, తల్లిదండ్రుల కోర్కెలు, ఆశలకు హద్దూ పద్దు లేకపోవడంతో విద్యార్థుల మీద ఒత్తిడి దారుణంగా పెరిగింది. తత్ఫలితంగా చిన్నారులు తీవ్ర ఉద్వేగానికి లోనవుతున్నారు. ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు.

విద్యా సంవత్సరం చివర జరిగే పరీక్షల్లో జయాపజయాలే భవిష్యత్తుకు నిర్దేశకాలని భావిస్తున్న తల్లిదండ్రుల మనస్తత్వం

పిల్లలను మానసిక గందరగోళానికి నెట్టేస్తోంది. మారుతున్న విద్యా వాతావరణంలో విద్యార్థులు విపరీతమైన మానసిక ఒత్తిడి ఎదుర్కోవాల్సి వస్తుంది. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకుంటే జీవితంలో పూర్తిగా ఓడిపోయినట్టు భావిస్తున్నందు వల్లనే ఇలా కొందరు నిండు ప్రాణాలు తీసుకుంటున్నారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిళ్ళు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులకు దారి తీస్తోందని చెప్పవచ్చు. కొందరు ఆత్మహత్య ప్రయత్నం చేసి చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు బతికి బయట పడ్తున్నారు. విద్యాభ్యాసంలో విద్యార్థులు వెనుకబడిపోవడం ఆత్మహత్యలకు ఒక ప్రేరకంగా ఉంటోంది. అలాగే ప్రేమలో విఫలమవడం కూడా ఆత్మహత్యలకు కారణం అవుతున్నది. ప్రతి రెండు నిమిషాలకు ఆత్మహత్యా ప్రయత్నం జరుగుతోందని, ప్రతి పది నిమిషాలకు ఒక ఆత్మహత్య జరుగుతున్నదని ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. జీవితంలో గెలుపోటములు సమాన స్థాయిలో స్వీకరించాలనే ధైర్యం చెప్పాల్సిన తల్లిదండ్రులు తోటి పిల్లలతో పోలిక తెచ్చి 'నీకేం రోగం'.. వంటి మాటలతో మనసులను గాయపరుస్తున్నారు. ఇలాంటి ఆత్మన్యూనతతో బాధపడుతూ జీవితాలను విషాదంగా ముగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొందరైతే ఫలితాలు వరకు కూడా ఆగడం లేదు. ఈ పరిణామం విపరీత పరిణామాలకు దారి తీస్తుందని మానసిక చికిత్సా నిపుణులు అంటున్నారు. పిల్లల శక్తిసామర్థ్యాలను అంచనా వేయకుండా ఎంత సేపూ వారిని చదివే యంత్రాలుగా తయారు చేస్తున్నారు. తల్లిదండ్రులు దూరంగా కోచింగ్ తీసుకుంటున్న పిల్లల మానసిక ప్రవర్తనను గమనిస్తుండాలి. చాలాపెద్ద మొత్తంలో ఖర్చు చేశాం కనుక మంచి ర్యాంకు వచ్చి తీరాలని కాకుండా ఆర్థిక వ్యయానికి, శారీరక మానసిక శ్రమకూ ముడివేయకుండా భ్రమల నుంచి వైదొలగి వాస్తవాలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాకపోతే మేథో సంబంధ సుగుణాలు, నైతిక లక్షణాలు, సంబంధిత జ్ఞానం, నైపుణ్యం... మొదలైనవి విద్యార్థులకు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి పరీక్షలే విశ్వసనీయ సూచికలు. కాని అవి విపరీత పరిణామాలకు దారి తీయకుండా చూసుకోవాలి. చదువులపై అవగాహన పెంపొందాలి. చదువు విజ్ఞానాభివృద్ధికి, వికాసానికి దోహదపడాలి. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలి. ఆత్మ విశ్వాసంతో ముందుకు నడిపించాలి. ఇందుకు ప్రాథమిక దశ లోపలే మంచి పునాది పడాలి. స్కూళ్లు, వ్యక్తిత్వ వికాస కేంద్రాలుగా పని చేయగలిగినప్పుడే ప్రగతి శీలమైన నూతన భారతం రూపుదాల్చుతుంది. ఆ వెలుగులు ఇప్పుడు ఎందుకు కన్పించడం లేదు? ఎదిగే వయసులో కాలేజీకి వెళ్ళే పిల్లల మోములో చిరునవ్వు బదులు బాధా వీచికలకు కారణాలు ఏమిటి? బాధ్యులెవరు? అని సమీక్షించుకోవలసిన తరుణం ఆసన్నమయ్యింది.

### యువత మేలుకో...

పూర్వం చదువులు ఎలా ఉండేవో పెద్దలు చెప్పడమే గాని, ఈ తరం చూసి ఉండదు. నేడు చదువులు ఎంత ఉపయోగకరమో చెప్పడం కష్టమే కాని వీటి తీరుతెన్నులను కళ్ళారా చూడగలుగుతున్నాం. ఉన్నవాళ్ళ పిల్లలు చదువుకుని విదేశాల్లో స్థిరపడటం ఇప్పుడు ఫ్యాషన్‌గా మారింది. ఈ ఫ్యాషన్ అన్ని వర్గాలకు వ్యాపించి అనర్థాలకు కారణమవుతోంది.

ఎలాగైనా ర్యాంకు సాధించుకోవడం... ఇంజనీరింగో, మెడిసినో చేయడం.. ఆ తర్వాత ఏ అమెరికాకో వెళ్ళి సెటిలవ్వడం.. .ఇవే నేటి యువతరానికి పరమ లక్ష్యాలయి పోయాయి. విద్యార్థులు ఏదో సాధించాలి అనే లక్ష్యంతో కళాశాలలో చేరి, సాధించాల్సిన లక్ష్యాలను పక్కదారిలో పట్టించకుండా ఏ లక్ష్యం కోసం మన జీవితాన్ని ప్రారంభిస్తున్నామో ప్రతిరోజూ మననం చేసుకుంటూ జీవితాన్ని కొనసాగించినప్పుడే ఉన్నతమైన ఆలోచనలు ఆవిష్కరిస్తాయి. మార్పు ఎక్కడినుంచో రాదు. మీలో నుంచే మార్పు రావాలి. దేశానికి రైతే రాజు ఎంత నిజమో దేశానికి వెన్నెముక యువత అనేది కూడా అంతే సత్యం. యువత నిరంతర కృషి కొనసాగిస్తూ వినూత్నమైన ఆవిష్కరణలు చేసినప్పుడే దేశం ప్రగతి పథంలో ముందుకెళ్తుంది.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




ఇస్రా మేరాజ్ నేర్పిన పాఠం. **"తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అక్సా వరకు తీసుకు పోయిన అల్లాహ్ పరిశుద్ధుడు. దాని పరిసరాలను మేము శుభవంతం చేశాము. మేమతనికి మా (శక్తికి సంబంధించిన) కొన్ని సూచనలను చూప దలచాము. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే బాగా వినేవాడు, బాగా చూసేవాడు". (బనీ ఇస్రాయీల్: 1)**

## ఇస్రా -మేరాజ్ భావార్థం

ఇస్రా అన్నది పై ఆయతులోని అస్రా నుండి తీసుకోబడిన పదం. భాషా పరంగా దీనర్థం రాత్రి పూట ప్రయాణించడం. శాస్త్రీయ పరంగా-అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) మస్జిదె హరమ్ నుండి మస్జిదె అఖ్సా వరకు రాత్రి పూట చేసిన ప్రయాణం. మేరాజ్ అన్నది ప్రవక్త(స) వారి ప్రవచనం 'ఉరిజ' నుండి తీసుకోబడింది. భాషా పరంగా దీనర్థం- పైకి ఎక్కడం, ఉన్నతి. శాస్త్రీయ పరంగా ప్రవక్త(స) వారి గగన విహారం- అంటే మస్జిదె అఖ్సా నుండి ఏడు ఆకాశాల పైకి, అక్కడి నుండి సిద్రతుల్ మున్‌తహా వరకు, అక్కడి నుండి అల్లాహ్ దగ్గరకు వెళ్ళి సంభాషించడం, స్వర్గ నరకాల దర్శనం మొదలయిన సంఘటనల సమాహారం. ఖుర్‌ఆన్‌లో ఇస్రా ప్రస్తావన 17వ సూరహ్-బనీ ఇస్రాయీల్‌లో ఉండగా, మేరాజ్ ప్రస్తావన 53వ సూరహ్ అన్ నజ్మ్‌లో ఉంది. అలాగే ఈ రెండు ప్రయాణ వివరాలు ప్రవక్త(స) వారి పలు ప్రవచనాలలో పేర్కొనబడ్డాయి.

## ఇస్రా- మేరాజ్ నేపథ్యం

అనాథ అయిన తనను తన అనుంగు సంతానం కన్నా అధికంగా చూసుకున్న బాబాయి అబూతాలిబ్ గారి మరణం, ఆయన బ్రతికున్నంత కాలం ప్రవక్త(స) వారికి వెన్నుదన్నుగా నిలచారు. ఆపద సమయంలో ఆయన కొండంత అండనిచ్చారు. ఆయన మరణంతో మక్కా అవిశ్వాసులు చెలరేగిపోయారు. ప్రవక్త (స) వారిని చిత్రహింసలకు గురి చేయడమేకాక, ఆయన ఇద్దరు కూతుళ్ళను విడాకులిప్పించి ఆయన్ను మానసికంగా సయితం దెబ్బ తీయడానికి కుయుక్తులు పన్నారు. ఇది జరిగిన కొన్నాళ్ళకే సతీమణి హజ్రత్ ఖదీజా(ర.అ) కూడా మరణించారు. ధర్మప్రచార మార్గంలో బయట అయ్యే గాయాలకు మందులా పని చేసిన మహిళామూర్తి ఆమె. సత్యబాంధవి అయిన ఆమె ప్రవక్త (స) వారిని ఎన్నో విధాలుగా ఆదుకున్నారు. అలాంటి ప్రియ ధర్మచారిణి మరణంతో ఇటు ఇంటా అటు బయట ఒంటరి అయ్యారు ప్రవక్త(స). ఈ రెండు మరణాలు ఒకటి తర్వాత ఒకటి చోటు చేసుకోవడం వల్ల ప్రవక్త(స) తీవ్ర మనస్తాపానికి గుర య్యారు. అదే సమయంలో తాయిఫ్ ప్రయాణం మిగిల్చిన చేదు అనుభవం కూడా మరింతగా ఆయన్ను కలచి వేసింది. 'లా ఇలాహ ఇల్లల్లాహ్'ను నమ్మండి- అరబ్బు, అరబ్బేతర ప్రాంతాలు మీ పాదా క్రాంతం అవుతాయి అని ప్రజల్ని ధర్మమార్గం వైపునకు ఆహ్వానించే ఆయన్ను మక్కాలో ప్రవేశించకుండా అడ్డుకున్నారు.

ఒక అవిశ్వాసి రక్షణలో మక్కాలో ప్రవేశించాల్సిన గడ్డు స్థితి. అలాంటి నాజూకు తరుణంలో అన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్న, వింటున్న అల్లాహ్ ఆయన కోసం గగన యాత్ర ఏర్పాటు చేశాడు.

## ఇస్రా-మేరాజ్ కానుకలు

ఇస్రా-మేరాజ్ సందర్భంగా ఆయనకు లభించిన కానుకలు- 1) ఐదు పూటల నమాజు 2) సూరయె బఖరహ్‌లోని చివరి ఆయతులు 3) సత్సంకల్పానికే పుణ్యం- అది కార్యరూపం దాల్చకపోయినా.. దుస్సంకల్పానికి దండన లేదు, అది కార్య రూపం దాల్చనంత వరకు.

## విన్న గాథలు

1) దైవదూతల నాయకులయిన జిబ్రీల్(అ) వారి నోట మాషితహ్ బిన్తె ఫిర్‌ఔన్ (ఫిర్‌ఔన్ కూతురి వెంట్రుకలు సవరించే స్త్రీ) గాథ. 2) హజ్రత్ బిలాల్(ర) వారి గాథ.

## చూసిన దృశ్యాలు

1) బైతుల్ మామూర్ 2) సిద్రతుల్ మున్తహా 3) స్వర్గ నరకాల దర్శనం. కొందరు దుష్టులకు లభించే దండన, కొందరు ధర్మాత్ములకు లభించే ప్రతిఫలం.

## కలుసుకున్న వ్యక్తులు

1) ప్రవక్తలు మస్జిదె అఖ్సాలో 2) ఏడు ఆకాశాల మీద ఎనిమిది మంది ప్రవక్తలు. ప్రవక్త ఆదమ్, ఈసా, యహ్యా, యూసుఫ్, ఇద్రీస్, హారూన్, మూసా, ఇబ్రాహీమ్(అ) 3) దైవదూత జిబ్రీల్‌తోపాటు ఇతర దైవదూతలు.

సంభాషించిన వారు: 1) దైవదూతలు 2) దైవప్రవక్తలు 3) అల్లాహ్.

## మేరాజ్ పాఠాలు-మొదటి పాఠం-సుబ్హానల్లాహ్

ఇస్రా గురించి ప్రస్తావిస్తూ అల్లాహ్ మొదట 'సుబ్హానల్లజీ' అన్నాడు. అల్లాహ్ పవిత్రుడు, పరిశుద్ధుడు అన్నది దీనర్థం. పవిత్రతకు, పరిశుద్ధతకు మూలం అల్లాహ్. మనిషి చేసే లోప సహిత ఊహాగానాలకు, కల్పించే బూటకపు భాగస్వామ్యాలకు, ఆయనకు భార్యాపిల్లలు ఉన్నారన్న అపవాదుకి, ఆయన మానవా కారంలో అవతరిస్తాడన్న అపప్రదకు ఆయన అతీతుడు, పరమ పవిత్రుడు. అలాగే ఇస్రా మేరాజ్ ఈ మహత్తర సంఘటన జరిపించడంలో ఆయనకెవ్వరితోనూ పోలికలు లేవు. ఆయనకు ఆయనే సాటి. లక్షన్నర కిలోమీర్ల దూరం లో ఉన్న చంద్రుడి వెన్నెలను మనక వరకు అర సెకనులో చేరవేసే అల్లాహ్ సుబ్హానహూ తఆలాకు రాత్రి ఒక భాగంలో ప్రవక్త(స) వారిని మస్జిదె హరమ్ నుండి మస్జిదె అఖ్సా వరకు, మస్జిదె అఖ్సా నుండి ఏడు ఆకాశాల వరకు తీసుకెళ్ళి మళ్ళీ తీసుకురావడం ఏమంత కష్టం కాదు. సాధ్య, అసాధ్యాలు మనిషికేగానీ అల్లాహ్‌కు కావు. వెలుగు చీకట్లు, జయాపజయాలు అల్లాహ్‌కు సమానం. "(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు-వారు చెబుతున్నట్లుగా అల్లాహ్‌తోపాటు వేరే ఆరాధ్య దైవాలు గనక ఉండి ఉంటే వారు ఇప్పటికే సింహాసనాధీశుని వైపునకు వెళ్లే మార్గాన్ని అన్వేషించేవారే. ఆయన పరిశుద్ధుడు. వారు అనే మాటలకు అతీతుడు, మహోన్నతుడు". (బనీ ఇస్రాయీల్: 42,43)

నిజంగా చెప్పాలంటే 'అల్లాహ్ ఒక్కడే నిజ ఆరాధ్యుడు' అన్న సాక్ష్యాన్ని సృష్టిలోని అణువణువు ఇస్తుంది. ఆయన్ను తన పద్ధతి ప్రకారం స్తుతిస్తుంది. కాకపోతే మనకు వాటి స్తోత్రగానం అర్థం కాకపోవచ్చు. "మేము పర్వతాలను దావూద్(అ)కు స్వాధీన పర్చాము. అవి సాయంత్రం, ఉదయం అతనితోపాటు దైవస్తోత్రం చేసేవి". (స్వాద్: 18) ఒక్క మాటలో చెప్పాలంటే, "అల్లాహ్ స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనయాడని వస్తువంటూ ఏదీ లేదు". (బనీ ఇస్రాయీల్: 44)

మరి మనం ఏం చెయ్యాలి? "ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించండి. ఉదయం సాయత్రం ఆయన పవిత్రతను కొనియాడండి". (అహ్జాబ్: 41,42) అన్న అల్లాహ్ ఆదేశాన్ని అనుసరించి ఉదయం సాయంత్రాల వేళ విశేషాన్ని బట్టి ప్రవక్త(స) మనకు నేర్పిన దుఆలు, ప్రార్థనలు చేస్తూ నిరతం మన నాలుక అల్లాహ్ నామ స్మరణతో నానుతూ ఉండేలా చూసుకోవాలి.

## దాస్య ఔన్నత్యం

'తన దాసుణ్ణి తీసుకు వెళ్ళాడు' అన్నాడు అల్లాహ్. అల్లాహ్ తలిస్తే తన మిత్రుణ్ణి, తన ప్రవక్తను, తన ఆప్తుణ్ణి అని పేర్కొని ఉండొచ్చు కానీ 'తన దాసుణ్ణి' అని చెప్పడం వెనకాల గల దాస్య ఔన్నత్యాన్ని తెలియ పర్చడమే ఆయన అభిమతం. ఒక దాసుడు హోదా పరంగా ఏమయినా అయి ఉండొచ్చు, కానీ దైవ సమక్షంలో అతను దాస్య పరాకాష్టను చాటుకోవడమే అతనికి గౌరవం. మనమందరం అల్లాహ్ దాసులం. అడుగడునా ఆయన అవసరం గలవారం. అవసరార్థులం, అగత్యపరులం. అనుక్షణం ఆయన అవసరం మనకుంది. మనలో మంచి వారున్నారు, చెడ్డ వారున్నారు. ధర్మాత్ములూ ఉన్నారు, దుర్మార్గులూ ఉన్నారు. సజ్జనులూ ఉన్నారు, దుర్జనులూ ఉన్నారు. దాతలూ ఉన్నారు, రోతలూ ఉన్నారు. విశ్వాసులూ ఉన్నారు, అవిశ్వాసులూ ఉన్నారు. గులాంగిరీ అందరూ చేస్తున్నారు. విధానాల్లో ఆరాధ్య దైవాల్లో తేడా అంతే. కొందరు ధనానికి గులాములు, కొందరు

అందానికి గులాములు, కొందరు పేరుప్రతిష్టకు గులాములు, కొందరు కోరికలకు గులాములు. ఈ దాస్య విధానాల్లో అత్యున్నత విధానం అల్లాహ్ దాస్య విధానం. దాసులందరిలో ఉత్తమోత్త ములు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించేవారు. అల్లాహ్ మనల్ని స్వయంగా వీరు నా దాసులు, నా ప్రియతములు అని మెచ్చుకోవా లంటే మాత్రం మనం ఆయన నచ్చిన విధంగా నడుచుకోవాలి. దాసునిగా మనం ఏ స్థాయికి చేరాలంటే స్వయంగా అల్లాహ్ అడగాలి- 'మీ కోరిక ఏమిటి?' అని. అంతలా మనం ఆయన్ను ఆరాధించాలి.

## మహోన్నత శీల శిఖరాగ్రం

దాస్య శిఖరాల్ని అందుకున్న వ్యక్తి మహా ప్రవక్త (స). "ఓ ప్రవక్తా! నిశ్చయంగా నువ్వు మహోన్నత శీల శిఖరాగ్రానివి". (ఖలమ్:4) అని స్వయంగా అల్లాహ్ కితాబిచ్చాడు. అలాంటి వ్యక్తి కాళ్ళు వాసి పోయేలా రాత్రంతా నిలబడి ప్రార్థనలు చేసేవారు. "అల్లాహ్ మీ పూర్వ, వర్తమాన, భవిష్య పాపాలన్నింటినీ క్షమించేశాడు కదా!" అని సతీమణి అడగ్గా, "ఏమి, నేను ఒక కృతజ్ఞత నిండిన దాసునిగా ఉండకూడదా?" అని సమాధానమిచ్చారు ప్రవక్త ముహమ్మద్ (స). కృతజ్ఞతా భావం నిండిన దాసులుగా, సుభక్తా గ్రేసరులుగా మనం ఎదగాలి. క్రియా జీవితానికి సంబంధించిన ప్రతి విషయాన్ని అల్లాహ్‌కు అప్పగించాలి. ఆయన అనమన్నది అనాలి, ఆయన కనమన్నది కనాలి, ఆయన వినమన్నది వినాలి. ఆయన చేయమన్నది చేయాలి. అలా మనం చేయాల్సింది మనం చేస్తూ, షిర్క్ అడసు తొక్కకుండా జీవిస్తే తప్పక సహాయం, ఆధిపత్యం అందిస్తానని మాటిస్తున్నాడు: "మీలో ఎవరు విశ్వసించి, మంచి పనులు చేశారో అల్లాహ్, వారి పూర్వీకులను భూమికి ప్రతినిధులుగా చేసినట్లుగానే వారికి కూడా ప్రాతినిధ్యం వొసగుతాడు. తాను వారి కోసం సమ్మతించి ఆమోదించిన ధర్మాన్ని వారి కొరకు పటిష్టం చేసి, దానికి స్థిరత్వాన్ని కల్పిస్తానని, వారి కున్న భయాందోళనల స్థానే శాంతిభద్రతల స్థితిని కల్పిస్తానని వాగ్దానం చేసి ఉన్నాడు. వారు నన్ను మాత్రమే ఆరాధించాలి. నాకు సహవర్తులుగా ఎవ్వరినీ కల్పించకూడదు". (అన్ నూర్: 55)

## రాత్రి ఘనత

రాత్రికి రాత్రే అని అల్లాహ్ పేర్కొన్నాడు. ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల అల్లాహ్ రాత్రిని ప్రమాణంగా పేర్కొన్నాడు. రాత్రి పూట పడకల నుండి వేరయి అల్లాహ్ ధ్యానంలో లీనమవ్వడం తన ప్రియతమ దాసుల లక్షణంగా పేర్కొన్నాడు. ప్రతి రాత్రి చివరి ఝాములో అల్లాహ్ భూ ఆకాశానికి తనకు శోభనిచ్చే రీతిలో దిగి వచ్చి- "అడిగే వారున్నారా? నేను వారు కోరినది ఇస్తాను. వేడుకునే వారున్నారా? నేను వారి మొరను ఆలకిస్తాను" అంటూ ఫజ్ర్ వేళ వరకూ పిలుపునిస్తూ ఉంటాడు అని పేర్కొన్నాడు. రమజాను మాసపు ప్రతి రాత్రి ఇద్దరు దైవదూతలు 'మేలు కోరేవాడా త్వర పడు. కీడు కోరే వాడా! ఆగిపో' అని పిలుపునిస్తారు అని ప్రవక్త (స) సెలవిచ్చారు. తహజ్జుద్ ప్రార్థన రాత్రి వేళలో ఉంచబడింది. విత్ర్ నమాజు రాత్రి నమాజుగా ఖరారు చెయ్యబడింది. అలాగే ఫజ్ర్, మగ్రిబ్, ఇషా నమాజులు అయిదులో మూడు రాత్రి సమయంలో ఉంచబడ్డాయి. రాత్రి ప్రార్థనను అల్లాహ్ రహస్య సంభాషణగా పేర్కొనడం జరిగింది. ప్రజలు నిద్రిస్తుండగా లేచి అల్లాహ్ సన్నిధిలో భక్తిప్రపత్తులతో గడపడం స్వర్గ ప్రవేశానికి ప్రతీకగా పేర్కొనడం జరిగింది. అల్లాహ్ ముందు చీకటిని, తర్వాత వెలుగును పుట్టించడం జరిగింది. చంద్రమానం ప్రకారం రోజు రాత్రితో మొదలవుతుంది. రమజాను మాసంలో రాత్రి ద్వారా ప్రవేశించడం జరిగింది. లౌహె మహ్‌ఫూజ్ నుండి భూ ఆకాశానికి ఖుర్‌ఆన్‌ను రాత్రిలోనే అవతరింప జేయడం జరిగింది. అదే వెయ్యి మాసాల కన్నా ఘనతరమయిన రాత్రి లైలతుల్ ఖద్ర్. దైవదూతలు జిబ్రీల్ (అ)తో సహా దివి నుండి భువికి దిగి వచ్చేది రాత్రి (లైలతుల్ ఖద్ర్) సమయంలోనే. ప్రవక్త (స) హిజ్రత్ కోసం బయలు దేరడం కూడా రాత్రి వేళలో జరిగింది. సజ్జనులయిన మన పూర్వీకులు రహస్య దానధర్మాలు రాత్రి పూట చేసేవారు. ఇస్రా, మేరాజ్ మహా ఘట్టం సయితం రాత్రి వేళ సంభవించింది. అలాగే ప్రవక్త (స) వారి సహచరులు పగటిపూట ధర్మయోధులుగా దర్శనమిస్తే, రాత్రి పూట గొప్ప భక్తిపరుల్లా మారి పోయేవారు. ప్రవక్త(స) ఇషా నమాజు అనంతరం అనవసరంగా మేల్కొవడాన్ని ఇష్ట పడేవారుకాదు. ఒక్క మాటలో చెప్పాలంటే దెయ్యాలు తిరిగే వేళ కాదు రాత్రి, దైవానుగ్రహాలు కురిసే శుభ సమయం రాత్రి. కాబట్టి అల్లాహ్ దాసులయిన మనం రాత్రి ప్రార్థనా విశిష్ఠతను గుర్తించాలి. 'రాత్రి పూట పాపాలకు దూరంగా ఉండే వ్యక్తి పట్ట పగలు పవిత్రంగా ఉంటాడు' అన్న విషయాన్ని గుర్తుంచు కోవాలి. 'చీకటిలో తప్పు చేసేవారికి పగలంటే కూడా భయమే. చీకటిలో అల్లాహ్‌కు భయపడేవారు దేనికీ భయపడాల్సిన అవసరం ఉండదు'. రాత్రి ఆరాధనలో గడిపేవారు ప్రశాంత జీవితం గడిపితే, రాత్రిని పాపకార్యాల్లో పాడు చేసుకునే వారు భయం, భయంగా జీవిస్తారు.

## మస్జిద్ ప్రాశస్త్యం

'మస్జిదె హరామ్ నుండి మస్జిదె అఖ్సా వరకు' అని అల్లాహ్ పేర్కొన్నాడు. అంటే ఇస్రా మేరాజ్ ప్రయాణానికి ప్రారంభ స్థలం మస్జిద్. ముగింపు స్థలం కూడా మస్జిదే. భువన స్వర్గవనాలు

మస్జిద్‌లు. అల్లాహ్‌ గృహాలు మస్జిద్‌లు. అల్లాహ్‌ను బిగ్గరగా స్తోత్రగానం చేసే స్తుతి కేంద్రాలు మస్జిద్‌లు. 'ఓ అల్లాహ్‌ నీ కారుణ్య తలుపుల్ని మా కొరకు తెరచు' అన్న ప్రార్థనతో ప్రవేశించే పవిత్ర స్థలాలు మస్జిద్‌లు. ప్రాపంచిక పరాచికాలకు చోటు లేని ప్రదేశాలు మస్జిద్‌లు. "ఏ గృహాల గౌరవ ప్రతిపత్తిని పెంచాలని, మరి వాటిలో తన నామస్మరణ బిగ్గరగా చేయాలని అల్లాహ్‌ ఆజ్ఞాపించాడో వాటిలో ఉదయం, సాయంత్రం అల్లాహ్‌ పవిత్రతను కొనియాడు తుంటారు. (వారు ఎలాంటి వారంటే) క్రయ విక్రయాలుగానీ, వర్తకంగానీ అల్లాహ్‌ నామస్మరణ, నమాజు స్థాపన, జకాతు చెల్లింపు విషయంలో వారిని పర ధ్యానానికి లోను చేయలేవు". (అన్‌ నూర్‌: 36)

మానవ చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో జరిగిన ఈ సంఘటనకు ప్రారంభం మస్జిద్‌ (మస్జిదె హరామ్‌). మధ్యమం మస్జిద్‌ (మస్జిదె అఖ్సా), గమ్యం మస్జిద్‌ (బైతుల్‌ మామూర్‌), శుభ ముగింపు మస్జిద్‌, (మస్జిదె అఖ్సా, హరామ్‌). దీన్ని బట్టి ఇస్లాంలో మస్జిద్‌కున్న ప్రాధాన్యత బోధ పడుతుంది. స్వయంగా ప్రవక్త(స) వారు సయితం మదీనా వెళ్ళే మార్గంలో ఉండగానే మస్జిద్‌ ఖుబా నిర్మించారు. మదీనా వెళ్ళాక తన ఇంటికన్నా ముందు మస్జిద్‌ నిర్మాణాన్ని చేపట్టారు. అంటే ముస్లిం జీవితంలో స్వగృహం కన్నా అల్లాహ్‌ గృహాలనబడే, స్వర్గ వనాలనబడే మస్జిద్‌లు ఎక్కువ ప్రాధాన్యం గలవి. కాబట్టి ఒక ముస్లిం తన స్వగృహం కన్నా మస్జిద్‌ను గౌరవించాలి, దానితో ముడిపడి ఉన్న అవసరాలను తీర్చాలి. మస్జిద్‌లు లేని ముస్లిం ప్రాంతాలలో మస్జిద్‌ నిర్మాణ శుభకార్యానికి శ్రీకారం చుట్టాలి. మస్జిద్‌లను అల్లరి మూకల నుండి కాపాడాలి. అయిదు పూటల నమాజును మస్జిద్‌లోనే వెళ్ళి చేసే ప్రయత్నం శక్తివంచన లేకుండా చేయాలి.

## మస్జిదె హరామ్‌ ప్రాశస్త్యం

అల్లాహ్‌ ఈ ప్రయాణాన్ని మస్జిదె హరామ్‌ నుండి ప్రారంభించి మస్జిదె హరామ్‌తోనే ముగించాడు. ఆ విధంగా ఇస్లాంలో మస్జిదె హరామ్‌కు ఉన్న విశిష్ఠతను విశదపర్చాడు. మస్జిదె హరామ్‌ ఏ భూభాగంపైనయితే ఉందో అది ప్రపంచ భూభాగాలన్నింటిలో కెల్లా మహిమాన్వితమయిన భూభాగం. "నిశ్చయంగా ఈ పట్టణాన్ని అల్లాహ్‌ భూమ్యాకాశాలను పుట్టించిన నాడే పవిత్రమ యినదిగా చేశాడు. ఆయన తప్ప ప్రజలెవ్వరూ దాన్ని పవిత్ర మయినదిగా ప్రకటించలేదు" అన్నారు ప్రవక్త(స). (బుఖారీ) అందులో ఒక్క పూట నమాజు చదివితే లక్ష నమాజులు చదివి నంత పుణ్యాన్ని అల్లాహ్‌ ప్రసాదిస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కాబా గృహం ఉన్నంతవరకే లోకం ఉంటుంది. అది చెదిరిందంటే లోకం మొత్తం చెల్లాచెదురయి పోతుంది.

## మస్జిదె అఖ్సా ప్రాశస్త్యం

ప్రవక్త (స)ను మస్జిదె హరామ్‌ నుండి మస్జిదె అఖ్సా వరకు తీసుకెళ్ళడం జరిగింది. అక్కడ ప్రవక్త (స) ఇతర ప్రవక్తలందరికీ నాయకత్వం వహించి నమాజు చేయించారు. ఇది ముస్లింల రెండు ఖిబ్లాల్లోని ఒక ఖిబ్లా. అక్కడ ఒక్క పూట నమాజు చేస్తే 500 నమాజులు చేసేంత పుణ్యం అల్లాహ్‌ అనుగ్రహిస్తాడు. ప్రస్తుతం మన వద్ద ఒక ఖిబ్లా మాత్రమే ఉంది. మరో ఖిబ్లాను కూడా యూద కబంద హస్తాల నుండి కైవసం చేసుకున్నప్పుడే ముస్లిం సమాజం వాస్తవ కీర్తితో అలరారుతుంది.

## దుఆ ప్రాముఖ్యత

"నిశ్చయంగా అల్లాహ్‌ బాగా వినేవాడు, చూసేవాడు". (ఇస్రా:1) ఈ సందర్భంగా అల్లాహ్‌ ప్రవక్త (స) వారికి ధైర్యాన్నిస్తూ, ఓ ప్రవక్తా! ప్రపంచం మీ గోడును పట్టించుకోకపోయినా, మీపై జరిగే హింసా కాండను చూడకుండా కళ్ళు మూసుకున్నా, నీకు నేనున్నాను. నీ మొరను వింటున్నాను, నీవు సహిస్తున్న చిత్రహింసల్ని గమనిస్తు న్నాను. నీవు చేసే ఏ కృషినీ వృథా కానివ్వనని మాటిస్తున్నాను. నేడు సయితం ముస్లిములపై జరుగుతున్న మారణకాండను ప్రపంచ మీడియా పట్టించుకున్నా, పట్టించుకోకపోయినా, వారి ఆక్రందనల్ని ఎవరు విన్నా వినకపోయినా అల్లాహ్‌ మాత్రం అంతా వింటున్నాడు, అంతా చూస్తున్నాడు. ఆయన యుక్తికి లోబడి నేడు ముస్లింలకు ఎదురయి ఉన్న భయానక వాతావరణాన్ని ప్రశాంతమయం చేస్తాడు. ఇందులో సందేహం లేదు. మనం చెయ్యాల్సిందల్లా ఒక్కటే, పరిస్థితులు ఎంత ప్రతికూలించినా ఆయన్నే ఆరాధించాలి, సహాయం కొరకు ఆయన్ను మాత్రమే అర్థించాలి. ధర్మ మార్గం మీద సహన స్థయిర్యాలను ప్రదర్శించాలి.

## విశ్వాసాన్ని సాన పెట్టే ప్రక్రియ పరీక్ష

మేరాజ్‌ సందర్భంగా ఏడు ఆకాశాల పైన దైవదూతల నాయకుల యిన హజ్రత్‌ జిబ్రీల్‌(అ) వారి ద్వారా దైవప్రవక్తల నాయకుల యిన ముహమ్మద్‌(స) వారికి నియంత ఫిర్‌ఔన్‌ కూతురి కేశాలంకరిణి (విశ్వాసురాలి) హృదయ విదారక గాథను విన్పించడం జరిగింది. అంటే విశ్వాస మార్గంలో పరీక్షలు సహజమే. అయితే అంతిమ విజయం మాత్రం సత్యానిదే, ధర్మానిదే.

## ఇస్లాం ప్రకృతి ధర్మం

మేరాజ్‌ సందర్భంగా ప్రవక్త(స) వారు పాలును ఎన్నుకుంటే, 'మీరు సహజ నైజాన్ని ఎన్నుకున్నారు' అని చెప్పడం జరిగింది. అంటే ఇస్లాం ప్రకృతి ధర్మం. కలుషితం కాని మానవ నైజానికి దగ్గరగా ఉన్న ధర్మం. పుట్టే శిశువు కడుపులో మొదట ఎంతో సులభంగా

వెళ్ళే ఆహారం, పాలు, అంతే సులభంగా జీర్ణమయి పోతుంది కూడా. అలాగే పుట్టే ప్రతి శిశువు ఇస్లాం ధర్మం మీదే పుడుతుంది. పెద్దయ్యాక దాన్ని పాటించడం కూడా అంతే సులభం. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ "ధర్మం సులువయినది" అన్నారు ప్రవక్త (స).

## నమాజు ప్రాశస్త్యం

ధర్మాదేశాలన్ని దాదాపు దైవదూత జిబ్రీల్(అ) వారిని మాధ్యమంగా చేసి ఇవ్వబడినవే. ఒక్క నమాజు తప్ప. అల్లాహ్ అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స)ను ఏడు ఆకాశాల పైకి పిలిపించుకొని ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా ప్రత్యక్షంగా ప్రసాదించిన మహదానుగ్రహం నమాజు. ఈ కారణంగానే "నమాజు లేని మతధర్మంలో మేలు లేదు" అని ఓ సందర్భంలో అంటే, "విశ్వాసి జీవితాన్నుండి అంతిమంగా అంతరించే మేలిమి కార్యం నమాజు" అని వేరొక సందర్భంలో పేర్కొన్నారు ప్రవక్త (స).

## సామాజిక రుగ్మతల పర్యవసానం

మేరాజ్ సందర్భంగా ప్రవక్త(స) పలు సామాజిక రుగ్మతలు, చెడు లక్షణాలకు లభించే శిక్షల్ని కూడా వీక్షించారు. వాటిలో సమాజాన్ని, కుటుంబ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే అక్రమ సంబంధ శిక్షలూ ఉన్నాయి. అక్రమార్కులకు పడే శిక్షలూ ఉన్నాయి, వడ్డీ వ్యాపారుల నడ్డి ఎలా విరగ్గొట్టబడుతుందో కూడా ఉంది. పరాయి వ్యక్తి సంతానాన్ని తన భర్తసంతానంగా నమ్మించే స్త్రీకి పడే దండన వివరాలూ ఉన్నాయి. నీతులు చెబుతూ నీచంగా బ్రతికే వారి దుర్గతి దృశ్యాలూ ఉన్నాయి. ఇవి మనిషికి ఇహపరాల్లో ఎంత హాని చేస్తాయో ఈ సందర్భంగా తెలుపడం జరిగింది.

## ఇస్లామీయ సామ్రాజ్య స్థాపన సూత్రాలు

మేరాజ్ సందర్భంగా ఒక ఇస్లామీయ రాజ్య స్థాపనకు కావాల్సిన సూత్రాలను సయితం తెలుపడం జరిగింది. అలాగే భవిష్యత్తులో యూదుల నుండి ఎదురుకాబోయే ఎత్తుగడల గురించి హెచ్చరిక కూడా ఉంది.


## విశ్వాస బలంతోనే విజయం

మేరాజ్ సంఘటన జరగక ముందు, జరిగిన తర్వాత స్థితిగతులను పరిశీలించినట్లయితే- తాయిఫ్ నుండి తిరుగు ప్రయాణంలో జిన్నుల ఒక వర్గం ప్రవక్త(స) వారిని విశ్వసించి, ఆయన మానవులకు మాత్రమే కాదు జిన్నాతులకు సయితం ప్రవక్త అన్న మాటకు సాక్షాత్తు నిదర్శనంగా నిలిస్తే, మనుషులయిన మక్కా వాసులు మాత్రం మానవ మహోపకారి ముహమ్మద్(స) వారిని మక్కాలో ప్రవేశించకుండా అడ్డుకున్నారు. అప్పుడు ఆయన ఒక అవిశ్వాసి రక్షణలో మక్కాలో ప్రవేశించడం జరిగింది. అది చూసి కొందరు బలహీన విశ్వాసులు ధర్మభ్రష్టులయ్యారు. ఇక మేరాజ్ సంఘటనను వివరించిన తర్వాత అయితే సరే సరి. ఎందరో ధర్మం నుండి వైదొలిగారు. అల్లాహ్ మేరాజ్ సంఘటన ద్వారా తర్వాత స్థాపించబడే ఇస్లామీయ రాజ్యానికి కావాల్సిన మేలిమి విత్తనాల్ని ఎన్నుకొని, నాసిరకం విత్తనాల్ని ఏరి పారేయదలిచాడు. నాడే కాదు, నేడు సయితం బలహీన విశ్వాసం గల వారికి విజయశ్రీ కాళ్లు పట్టదు. విశ్వాస బలం గలవారికే నేటికయినా, ఏనాటికయినా విజయం వరిస్తుంది.

## అల్లాహ్ దివ్య దర్శనం

"మీరు మేరాజ్ సందర్భంగా అల్లాహ్‌ను దర్శించుకున్నారా?" అని ప్రవక్త(స) వారిని అడిగితే- "నూరున్ అన్నా అరాహు"- తను అఖండ జ్యోతి, నేనెలా ఆయన్ను చూడగలను?' అని సమాధానమి చ్చారు. ఆయన ఈ మాట వల్ల దేవుని విషయంలో ప్రజల్లో చోటు చేసుకుని ఉన్న మిథ్యా భావాలన్నీ కొట్టుకుపోయాయి. అయితే ఆయన ఇతర ఉల్లేఖనాల ద్వారా స్వర్గవాసులకు స్వర్గంలో అల్లాహ్ దర్శనా భాగ్యం దక్కుతుం దని, వారు ఆయన్ను పున్నమి చంద్రుణ్ణి చూసినట్లు స్పష్టంగా చూస్తారని తెలు స్తుంది. అల్లాహ్ మనందరికీ ఆయన ప్రియతమ దాసు లుగా జీవించి, ఆయన స్వర్గ సీమలో ప్రవేశించి, ఆయన దివ్య దర్శనంతో పునీతులయ్యే భాగ్యాన్ని ప్రసాదించు గాక! ఆమీన్.

తుదిగీటు




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**